



పర్యాటకం.. దొంగలు దొరికారు

రాజస్థాన్ ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు





వెలుగులోకి తెచ్చిన.. ఆంధ్రజ్యోతి

'పర్యాటకంలో సైబర్ దొంగలు' శీర్షికన ఈ ఏడాది జనవరిలో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలలో కూడా ఈ ముఠా దందా యథేచ్ఛగా సాగుతున్నట్లు వివరించింది. ఆ తర్వాత పోలీసుల విచారణలో వేగం పెరిగింది. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టిన బాపట్ల పోలీసులు ఎట్టకేలకు సైబర్ నేరగాళ్ల మోసాలకు చెక్‌పెట్టారు.

పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాల సందర్శనకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతుంటారు. పర్యాటక శాఖ ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తుండగా, వీటికి భక్తులు, పర్యాటకుల నుంచి పెద్దఎత్తున ఆదరణ లభిస్తోంది. ఇదే అవకాశంగా కొందరు ఓ ముఠాగా ఏర్పడి ఆన్‌లైన్ మోసాలకు తెరతీశారు. ఆన్‌లైన్‌లో గదులు బుక్ చేసుకోవాలనుకునే వారే లక్ష్యంగా నకిలీ వెబ్‌సైట్లతో ఆకట్టుకుని భక్తులు, పర్యాటకులను దోచేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఎంతో కాలంగా ఈ ముఠా ఆటలు యథేచ్ఛగా సాగాయి. టీటీడీతో పాటు శ్రీశైలం, మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ దేవస్థానాలను కూడా వదలకుండా ఈ ముఠా సైబర్ నేరాలకు పాల్పడింది. సూర్యలంక పర్యాటకులు బాపట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దేశ వ్యాప్తంగా అనేక పర్యాటక ప్రదేశాల్లో ఈ తరహా సైబర్ మోసాలు వెలుగులోకి వచ్చాయి. 18 రాష్ట్రాల పరిధిలో 127 ఫిర్యాదులు వచ్చినట్లు పోలీసు విచారణలో తేలినా విచారణ మాత్రం బాపట్ల రూరల్ పీఎస్‌లో నమోదైన కేసు ఆధారంగానే జరగడం గమనార్హం.

- బ్యాంకు ఖాతాల ఎండ్ యూజర్‌తో ఛేదించిన ఖాకీలు
- ఇద్దర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తీసుకుని విచారిస్తున్న పోలీసులు
- దర్యాప్తు బృందాలను ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీ తుషార్‌డూడీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఏపీటీడీసీ పర్యవేక్షణలో బాపట్ల జిల్లా సూర్యలంక సముద్ర తీరంలో ఉన్న హరిత రిసార్టు పర్యాటకులకు ఆతిథ్యం ఇస్తోంది. ఇక్కడకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. దీంతో వెబ్‌సైట్ ద్వారా గదులను పర్యాటకులు బుక్ చేసుకుంటారు. ఈ క్రమంలో హరితా రిసార్టునే పోలిన వెబ్‌సైట్‌లో గదులు బుక్ చేసుకుని మోసపోయిన పర్యాటకులు గతేడాది జూన్ 16న రిసార్ట్ మేనేజర్ అశోక్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా అదే రోజు బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తు సాగుతుండగానే దేశవ్యాప్తంగా అనేక పర్యాటక ప్రదేశాలలో ఈ తరహా సైబర్ మోసాలు (మిగతా 6వ పేజీలో)

అన్నదాతకు అర్హులు.. 2,39,959 మంది

- నేడు రైతుల ఖాతాలకు రూ.167.97 కోట్లు జమ
- పెట్టుబడి సాయంగా ఉపయోగపడుతుందని రైతుల హర్షం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సూపర్ సిక్స్‌లో మరో పథకం అమలుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం కిసాన్‌తో రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం లింకై ఉంది. దీంతో కేంద్రం శనివారం పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలో వివిధ వడపోతల అనంతరం 2,39,959 మంది అర్హులుగా ప్రకటించింది. పీఎంకిసాన్ రూ.2వేలు, సుఖీభవ రూ.5 వేలు మొత్తంగా ఒక్కొక్క రైతు ఖాతాలో రూ.7 వేలు జమ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని రైతులకు రూ.167.97 కోట్లు పంపిణీ చేయనున్నారు. అన్నదాత సుఖీభవ మొదటి విడత నగదు పంపిణీని గ్రామస్థాయిలో పండుగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి సూచించింది. ఈ కార్యక్రమాల ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం చర్చించారు. ప్రజా ప్రతినిధులు, రైతులను ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని ఆదేశించింది. కుడి కాల్వకు నీటి సరఫరాతో రైతులు పంటల సాగును విస్తృతంగా చేపట్టారు. ఈ తరుణంలో ప్రభుత్వం అందిస్తున్న రూ.7 వేలు పెట్టుబడి సాయంగా ఉపయోగపడతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే రీసర్వే, రెవెన్యూ శాఖ తప్పిదాల వల్ల కొందరు రైతులు సుఖీభవను కోల్పోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఆయా రైతులకు శాపంగా మారింది. రెవె న్యూ కార్యాలయాల చుట్టు ఇప్పటికీ ఆయా రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా సుఖీభవ అర్హుల ఇలా..

నియోజకవర్గం	అర్హులు సంఖ్య	పెట్టుబడి సాయం రూ కోట్లలో..
సత్తెనపల్లి	36,672	25.67
నరసరావుపేట	20,425	14.30
చిలకలూరిపేట	21,614	15.13
పెదకూరపాడు	41,045	28.73
గురజాల	35,595	24.92
వినుకొండ	45,773	32.04
మాచర్ల	38,835	27.18


రూ.240 కోట్ల ఇసుక బొక్కేశారు..

- 12 లక్షల టన్నుల అక్రమ మైనింగ్
- శాటిలైట్ చిత్రాలతో అక్రమాలు గుర్తింపు
- జేపీ సంస్థకు నోటీసులు.. చర్యలకు రంగం సిద్ధం
- వైసీపీ హయాంలో అక్రమాల లెక్కతేల్చిన అధికారులు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో జరిగిన ఇసుక అక్రమాలపై గనులశాఖ లెక్కతేల్చింది. రూ.240 కోట్ల విలువైన ఇసుకను బొక్కేశారని గుర్తించింది కృష్ణానదిలో దాదాపు 126 హెక్టార్లలో ఇసుక అక్రమాలు జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. అప్పటి ఇసుక కాంట్రాక్టర్ జేపీ సంస్థ దాదాపు 12 లక్షల టన్నుల ఇసుకను సదరు సంస్థ అక్రమంగా తరలించుకుపోయిందని గుర్తించారు. మీటరు లోతు తవ్వ కాలు జరిపితేనే దాదాపు 12 లక్షల టన్నుల ఇసుక తవ్వినట్లుగా అధికారులు తేల్చారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇంకా ఎక్కువ లోతు తవ్వకాలు జరిపి ఉంటే ఆ మేరకు అక్రమాలను నమోదు చేయనున్నారు. శాటిలైట్ ఛాయా చిత్రాల ఆధారంగా ఇసుక అక్రమాలను అధికారులు గుర్తించారు. జిలాల్లో 2021-2024 కాలంలో ఇసుక రీచుల్లో అక్రమ తవ్వకాలపై చర్యలకు ఇసుక కమిటీ సమాయత్తమవుతోంది. ఇసుక అక్రమాలపై తీసుకోవాల్సిన చర్యలపై ఇటీవల జరిగిన ఇసుక కమిటీ సమావేశంలో అధికారులు చర్చించారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపిన జేపీ సంస్థకు నోటీసులు జారీ చేసి, జరిమానా వసూలు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. వైసీపీ హయాంలోని ఇసుక మాఫియాపై జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమిస్తుండటంతో అక్రమార్కులు కంగుతింటున్నారు. జిల్లా మైనింగ్ అధికారి నాగను వివరణ కోరగా అక్రమ ఇసుక తవ్వకాలు జరిగినట్లు ఇసుక కమిటీ నిర్ధారించిందన్నారు. ఈ మేరకు అక్రమాలకు పాల్పడిన జేపీ సంస్థకు రెండు రోజుల్లో నోటీసులు జారీ చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు జరిమానా వసూలు చేస్తామన్నారు.



26 క్రస్ట్ గేట్ల ద్వారా **నీటి విడుదల**

పులిచింతలకు 2.32లక్షల క్యూసెక్కులు..

జాతీయ రహదారుల విస్తరణకు **నేడు శంకుస్థాపన**

పటిష్టంగా **రైల్వే భద్రతా విభాగం**

● అధిక సంఖ్యలో ఆర్‌పీఎఫ్ కేసుల నమోదు ● అదే స్థాయిలో రికవరీలు, జరిమానాలు ● డీఆర్‌ఎం సుథేష్ణ సేన్

సర్కారు ఎక్స్‌ప్రెస్ ప్రయాణించే **రోజుల మార్పు**

కొడుక్కి తెలియకుండా.. **తల్లి ఆస్తికే ఎసరు**

● తప్పుడు ధ్రువపత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్ ● ఏడుగురిపై కేసు నమోదు, అరెస్ట్ ● నిందితులకు 15 రోజుల రిమాండ్

4



శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని పిడుగురాళ్లలో కనకదుర్గ అమ్మవారిని వివిధ రకాల పండ్లతో విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. - పిడుగురాళ్ల

పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలి

లబ్ధిదారులకు సూచించిన కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మండలంలోని కాకానిలో శుక్రవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్లకు కలెక్టర్ స్వయంగా వెళ్లి నగదు అందజేశారు. లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడి వారి యోగక్షేమాలను, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేయడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 1వ తేదీన పింఛన్లు ఏదైనా కారణం చేత తీసుకోని వారికి శనివారం పంపిణీ చే స్తామని కలెక్టర్ తెలిపారు.



కాకానిలో పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

క్రమశిక్షణా చర్యలపై.. కలకలం

మాచర్లలో 17 మందిపై రెవెన్యూ కొరడా

మాచర్ల టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం, అవినీతి, అక్రమంగా నగదు కలిగి ఉన్న రెవెన్యూ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలకు ఆదేశించడం కలకలం సృష్టించింది. 2020 జనవరి 24న ఏసీబీ అధికారులు మాచర్ల తహసీల్దార్ కార్యాలయంపై దాడి చేసి అవినీతిపై ఫిర్యాదులు, గుట్టలు గుట్టలుగా ఫైల్స్ పేరుకుపోవడంతో పాటు అధికమొత్తంలో నగదు కలిగి ఉన్న వారిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తాజాగా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రకారం మాచర్లలో పట్టుబడిన కేవీ శ్రీనివాసరావు(డీటీ), జీ వెంకటేశ్వర్లు(సర్వేయర్), ఎస్‌కే మస్తాన్‌వలి(సీనియర్ అసిస్టెంట్), వీఆర్వోలు బండ్ల రామారావు, పసుపులేటి సైదులు, మిర్యాల ముత్తయ్య, షేక్ మస్తాన్‌వలి, కటికల శ్రీనివాసరావు, సయ్యద్ హసన్, వేటగిరి మురళీకృష్ణ, వైవీ రమణమూర్తి, గన్నెబోయిన భాస్కర్, దాసరి మణికుమార్, లాం విశ్వేశ్వరరావు, టీ మస్తాన్‌జానీబాషా, పోలే జానయ్య, చిదంబరం కాశీవిశ్వనాథంపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు.

వందల ఎకరాలున్నా.. నైవేద్యం

- దేవుడి భూములన్నీ అన్యాక్రాంతం
- శిథిలావస్థలో జూలకల్లులోని పలు ఆలయాలు

పిడుగురాళ్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పేరుకు ఆ స్వామి వార్లకు వందల ఎకరాలు ఉన్నాయి.. అయినా నిత్య పూజలు లేవు. నైవేద్యాలు సమర్పించడంలేదు.. దేవుడి సేవలో తరించే అర్చకులకు జీతాలు లేవు.. ఆలయాల బాగోగులు పట్టించుకునే వారు లేకపోవడంతో దయనీయ స్థితికి చేరాయి. భూములు అన్యాక్రాంతమై స్వామి పరిస్థితి అగమ్యగోచరంగా మారడంతో పాటు శిథిలావస్థకు చేరిన ఆలయాల పరిస్థితి పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామంలోనిది. ఎన్నో ఏళ్ల క్రితం గ్రామంలో దాతలు ఆలయాలను నిర్మించి దూప దీప నైవేద్యాలకు, అర్చకుల జీవనానికి ఇబ్బంది లేకుండా భూమిలను విరాళంగా ఇచ్చారు. గ్రామంలో భీమలింగేశ్వరస్వామి ఆలయానికి సుమారు 100 ఎకరాలు, ఆంజనేయస్వామి ఆలయానికి 12 ఎకరాలు, వేణుగోపాలస్వామి ఆలయానికి 120 ఎకరాలు, కోదండరామస్వామి దేవాలయానికి 22 ఎకరాలు, బుక్క రామాలయానికి 14 ఎకరాలు భూమి ఉన్నాయి. మొదట్లో ఆ భూములను గ్రామానికి చెందిన రైతులు సాగుకు తీసుకుని కొద్దో గొప్పో కౌలు చెల్లించడంతో దూప దీప నైవేద్యాలు జరుగుతుండేవి. అయితే ఆ భూములన్నీ అన్యాకాంతం కావడంతో ప్రస్తుతం దేవుడికి నిత్య పూజలకు రూపాయి కూడా లేదు. రెవెన్యూ రికార్డులు, దేవదాయశాఖ రికార్డుల్లో ఉన్న ఆయా భూములు పాతికేళ్లుగా క్రమక్రమంగా ఆక్రమణలకు గుర య్యాయి. దేవదాయ శాఖ అధికారులు కౌలు వేలం నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ ఫలించలేదు. వారసత్వంగా అర్చకత్వం చేస్తున్న పూజారులు సొంత నగదుతో దీపారాధన చేస్తున్నారు.

కౌలు వేలంపై స్పందన శూన్యం

స్థానికులు కొందరు ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి ఆలయాల దుస్థితిని వివరించారు. ఈ ఏడాది భూములకు కౌలు నిర్వహించాలని మంత్రి దేవదాయశాఖ అధికారులను ఆదేశించారు. వాస్తవానికి ఆయా భూములకు సరాసరి సగటున ఎకరాకు రూ.12 వేల నుంచి 15 వేలు కౌలు వచ్చే అవకాశం ఉంది. అయితే ఆ భూములను ఎన్నో ఏళ్లుగా తమ చెప్పు చేతల్లో పెట్టుకున్న కొందరు ఆ భూములను ఇతరులకు కౌలు కిస్తూ రూ.వేలల్లో ఆదాయం జేబులో వేసుకుంటున్నారు. ఎకరాకు కనీసం వెయ్యి రూపాయలు కూడా చెల్లించడం లేదు. ఈ ఏడాది దేవదాయశాఖ అధికారులు రెండు పర్యాయాలు భూముల కౌలు వేలంపై గ్రామంలో చాటింపు వేయించినా ఎవరూ ముందుకు రాలేదు. ఆక్రమణలోని భూములను దేవదాయశాఖ స్వాధీనం చేసుకుంటేనే కౌలుకు రైతులు ముందుకు వచ్చే అవకాశం ఉంది.



వేణుగోపాలస్వామి దేవాలయం



శ్రీభీమలింగేశ్వర స్వామి దేవాలయం

4న పల్నాడులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

నరసరావుపేట టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ నెల 4న సోమవారం పల్నాడు జిల్లాలో పర్యటిస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేట పట్టణంలో చాయ్ పే చర్చ, శోభాయాత్ర, కార్యకర్తలతో సమావేశం, పత్రికా మిత్రులతో ఇష్టాగోష్టి, వివిధ వర్గాల, వృత్తుల, మేధావులతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఎంఈఓ నియామకంలో..

ఉమ్మడి సర్వీస్ రూల్స్ పాటించాలి


డీఈవోకు వినతి పత్రం అందజేత

గుంటూరు(విద్య) ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జోన్ 3 (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) పరిధిలో ఎంఈఓల నియామకం లో ఉమ్మడి సర్వీస్ రూల్స్ పాటించాలని ప్రభుత్వ ఉపాధ్యా యులతో పాటు జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ ఉపాధ్యా యులను ఎంఈవోలుగా నియమించాలని పీటీఆర్‌టీయూ, ఏపీ యూఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు .ఈ మేరకు శుక్రవారం డీఈఓ సీవీ రేణుకకు వినతి పత్రం అందజేశారు. గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఎంఈఓ 1 ఖాళీలలను ప్రభుత్వ పాఠశాలల్లోని సీనియర్ ఉపాధ్యాయులతో భర్తీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం కృష్ణయ్య, గిరిప్రసాద్, బాలాజీ వెంకట సత్యనారాయణ, పి.పద్మ పాల్గొన్నారు.

పోలీస్ పవర్ లిఫ్టింగ్ క్యాంపు ప్రారంభం


క్యాంపు ప్రారంభంలో..

మంగళగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అక్టోబరులో జరుగనున్న ఆలిండియా పోలీస్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు జిల్లా ఆతిథ్యం ఇవ్వబోతుందని ఏపీ పోలీస్ స్పోర్ట్స్ అధికారి అభిరామ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర పోలీసు విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. నగరంలోని సంధానీ జిమ్ సెంటర్‌లో పోలీసుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పోటీలకు రాష్ట్ర పోలీసులను సన్నద్ధం చేసే లక్ష్యంతో ఈ ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయభాస్కరరావు, కోశాధికారి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యుడు ఉదయకిరణ్, పవర్ లిఫ్టింగ్ పోలీసు క్రీడాకారులు పాల్గొన్నారు.

పటిష్టంగా రైల్వే భద్రత విభాగం

- జనవరి- జూలై నేర నివేదిక
- అధిక సంఖ్యలో ఆర్‌పీఎఫ్ కేసుల నమోదు
- అదే స్థాయిలో రికవరీలు, జరిమానాలు
- డీఆర్‌ఎం సుధేష్ణ సేన్


ఆపరేషన్ యాత్రీ సురక్ష ద్వారా దొంగలను గుర్తించి అరెస్టు చేసిన ఆర్‌పీఎఫ్(ఫైల్)

గుంటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రైల్వే భద్రత విభాగం ఈ సంవత్సరం జనవరి నుంచి జూలై నెల వరకు వివిధ సెక్షన్ల కింద అధిక సంఖ్యలో కేసులు నమోదు చేసినట్లు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ రైల్ సురక్ష కింద 17 కేసులు నమోదు చేసి.. ఐదుగురు రిసీవర్లతో పాటు.. 33 మంది నేరస్తులను అరెస్టు చేసినట్లు చెప్పారు. చోరీకి గురైన రైల్వే సొత్తు రూ. 1,37,640 రికవరీ చేశామన్నారు. రైల్వే చట్టం కింద 3,353 కేసులు నమోదు చేసి 1,095 మంది నిందితులను దోషులుగా నిర్ధారించిన తర్వాత రూ. 2,59,500 జరిమాన వసూలు చేయడం జరిగిందన్నారు. ఆపరేషన్ ఉప లబ్ధ్ ద్వారా రూ. 183471 విలువ చేసే 86 లైవ్ టిక్కెట్‌లు, రూ. 3,84,027 విలువ గల 223 నంబర్లను ఉపయోగించి బుకింగ్ చేసిన టిక్కెట్లను(రూ.56,7498) స్వాధీనం చేసుకొన్నామన్నారు. 52 వ్యక్తిగత ఐడీలను బ్లాక్ చేశామని తెలిపారు. పొగాకు చట్టం కింద 541 మందిపై కేసులు నమోదు చేసి రూ.54,900 జరిమాన విధించామన్నారు. లిటరింగ్ కేసులు 522 నమోదు చేసి రూ.1,04,400 జరిమాన వసూలు చేయడం జరిగిందన్నారు. మిషన్ యాత్రి సురక్ష కింద 15 దొంగతనాల కేసుల్లో 14 మంది నేరస్తులను జీఆర్‌పీ అరెస్టు చేసిందని, ఇందులో ఆర్‌పీఎఫ్ క్రియాశీలక పాత్ర పోషించి రూ. 17,16,500లు రికవరీ చేశామన్నారు. ఆపరేషన్ ఆహత్ కింద మానవ అక్రమ రవాణని నిరోధించామన్నారు. 11 మంది ఏజంట్లు అక్రమంగా రవాణ చేస్తున్న 19 మంది పిల్లలను తాము రక్షించామని వివరించారు. ఆపరేషన్ సంరక్ష కింద వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్లతో దాడి చేసిన కేసుల్లో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అగ్నిమాపక స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 484 మందిని అరెస్టు చేసి కేసులు పెట్టామన్నారు. మిషన్ మహిళ సురక్ష ద్వారా 1340 మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మేరీ సహేలి బృందాలు ఒంటరిగా ప్రయాణించే మహిళ ప్రయాణికులతో సంభాషించడం జరిగిందన్నారు. ఆపరేషన్ నార్కోస్ ద్వారా 21.123 గంజాయి రికవరీ చేశామని వాటి విలువ రూ. 90,200గా ఉందన్నారు. ఆపరేషన్ నన్హే ఫరిస్తే కింద ఇంటి నుంచి పారిపోయి రైళ్లలో ప్రయాణిస్తున్న 83 మంది పిల్లలను రక్షించి చైల్డ్ హెల్ప్‌లైన్ కో-ఆర్డినేటర్‌లకు అప్పగించామన్నారు. ఆపరేషన్ అమానత్ ద్వారా ప్రయాణికులు వదిలిపెట్టిన విలువైన వస్తువులను రికవరీ చేసి అప్పగించామని వాటి విలువ రూ. 23,11,350గా ఉందన్నారు. ఆపరేషన్ సత్రక్ ద్వారా అక్రమంగా రవాణ చేస్తున్న 36 మద్యం బాటిల్స్‌ని పట్టుకొన్నామని తెలిపారు.

ప్రాణ రక్షణపై అవగాహన అవసరం


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, ఎమ్మెల్యే మాధవి, భాష్యం రామకృష్ణ

గుంటూరు విద్య ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు హృద్రోగ సమస్యలపై అవగాహన కల్పిం చాల్సిన అవసరం ఉందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. శుక్రవా రం చంద్రమౌళి నగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో నిర్వహించిన సీపీఆర్ అవగాహన సదస్సులో ఆమె పాల్గొని, మాట్లాడారు. భాష్యం విద్యా సంస్థల సహకారంతో ప్రాజెక్ట్ హార్ట్ ఇండియా ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పఇంచడం హర్షణీయమన్నారు. ప్రాజెక్ట్ హార్ట్ ఇండియా ఫౌండర్ అండ్ హానరరీ అడ్వైజర్ డాక్టర్ వేమూరి మూర్తి వీడియో వీడియో సందేశంలో సీపీఆర్‌పై ప్రయోగా త్మకంగా అవగాహన కల్పించారు. గుంటూరు డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సీపీఆర్‌పై పూర్తిస్థాయి అవ గాహన కల్పించాలని సూచించారు. జీజీహె చ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల సరేంద్ర కుమార్, విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మెడక్స్ ప్రిన్సిపల్ హరిబాబు, ప్రాజెక్ట్ హార్ట్ ఇండియా ఏపీ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొడాలి లావణ్య పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని


శంకుస్థాపన చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): జగన్ వల్ల విధ్వంసానికి గురైన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పాటుపడుతున్నారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో రూ. 45 లక్షలతో బీసీ సంక్షేమ భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమారుతో కలిసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ ఐదేళ్లుగా జగన్ వల్ల రాష్ట్రం పూర్తిగా భ్రష్టు పట్టిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నష్టపోయిన ప్రతి వ్యవస్థను బాగు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమాన్ని అమలు చేస్తూ.. మరోవైపు అభివృద్ధి కొనసాగిస్తూ కత్తి మీద సాము చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో భావితరాలకు మంచి భవిష్యత్తు ఉండాలని, మంచి ఉద్యోగాలు రావాలని దేశ విదేశాలు తిరిగి కష్టపడి కంపెనీలు తీసుకువచ్చేందుకు మంత్రి లోకేశ్, ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రమిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వాలు నిరంతరం మారుతూ ఉంటే అభివృద్ధి కుంటుపడుతుందని జగన్ ప్రభుత్వం నిరూపించిందన్నారు. ఒకే ప్రభుత్వం పదేళ్లపాటు కొనసాగితే అభివృద్ధి కొనసాగుతుందని ప్రజలు గుర్తించాలన్నారు. తన పరిచయస్తుడు డాక్టర్ సూదన గుంట రాఘవేంద్ర ప్రసాద్, కల్యాణి దంపతులను సంప్రదిస్తే.. సహృదయంతో రూ.4 కోట్లు మాతృభూమి అభివృద్ధికి అందజేసినట్లు చెప్పారు. ఈ నిధులతో మామిళ్ళపల్లి, వడ్లమూడి, నంబూరు గ్రామాల్లో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పొన్నూరు ప్రాంతంతో సంబంధం లేకపోయినప్పటికీ సామాజిక బాధ్యతతో నిధులు అందజేసిన ప్రవాసాంధ్రులు డాక్టర్ సూదన గుంట దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు కూడా కుల మతాలకు అతీతంగా ఆలోచించి అభివృద్ధికి సంక్షేమానికి ప్రాధాన్యతను ఇచ్చే కూటమి పార్టీల వైపు నిలవాలని పిలుపునిచ్చారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

సర్కారు ఎక్స్‌ప్రెస్ ప్రయాణించే రోజుల మార్పు

గుంటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): న్యూ గుంటూరు రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే సర్కారు ఎక్స్‌ప్రెస్ వారంలో ప్రయాణించే రోజులను రైల్వే బోర్డు మార్పు చేసింది. 17643 చెంగల్‌పట్టు - కాకినాడ సర్కారు ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం మంగళ, బుధ, శని, ఆదివారాల్లో న్యూ గుంటూరు మీదగా ప్రయాణిస్తోంది. అక్టోబరు నుంచి ఈ రైలు మంగళ, బుధ, శుక్ర, ఆదివారాల్లో న్యూ గుంటూరుకు వస్తుంది. 17656 పుదుచ్చేరి - కాకినాడ ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం సోమ, గురు, శుక్రవారాల్లో న్యూ గుంటూరుకు వస్తుండగా అక్టోబరు 2 నుంచి సోమ, గురు, శనివారాల్లో వస్తుంది. నంబరు. 17644 కాకినాడ - చెంగల్‌పట్టు సర్కారు ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం సోమ, మంగళ, శుక్ర, శనివారాల్లో న్యూ గుంటూరు మీదగా ప్రయాణిస్తుండగా అక్టోబరు 3 నుంచి మంగళ, బుధ, శుక్ర, ఆదివారాల్లో వస్తుంది. నంబరు. 17655 కాకినాడ - పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం బుధ, గురు, ఆదివారాల్లో న్యూ గుంటూరు మీదగా వెళ్తోంది. ఈ రైలు అక్టోబరు 4 నుంచి సోమ, గురు, శనివారాల్లో ప్రయాణిస్తుందని రైల్వే బోర్డు తెలిపింది.

కాచీగూడ, రాయగడ ఎక్స్‌ప్రెస్‌లకు ఏసీ త్రీటైర్ బోగీ..

నిత్యం కాచీగూడ, రాయగడకు రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌లకు అదనంగా ఏసీ త్రీటైర్ బోగీని శాశ్వతంగా జోడిస్తున్నట్లు రైల్వే బోర్డు తెలిపింది. 17251 గుంటూరు - కాచీగూడ ఎక్స్‌ప్రెస్‌కి సెప్టెంబరు 29, 17252 కాచీగూడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 30, 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 1, 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కి అక్టోబరు 2 నుంచి ఈ అదనపు ఏసీ త్రీటైర్ బోగీ అందుబాటులోకి వస్తుంది. దీని వల్ల ఈ రైళ్లకు ఏసీ త్రీటైర్ - 3, స్లీపర్ - 12, జనరల్ - 3, బ్రేక్ వ్యాన్-2 బోగీలకు సవరణ జరిగినట్లు అయింది.

పోలీసుల అదుపులో..

హత్య కేసు నిందితులు?

తుళ్లూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో శుక్రవారం తెల్లవారు జామున ముగ్గురు నిందితులను తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. చేబ్రోలు మండలానికి చెందిన ఓ వ్యక్తి గతంలో వడ్డమాను గ్రామంలో వైసీపీ నేతకు చెందిన బ్రిక్స్ రాయి తయారీ కంపెనీలో పని చేశాడు. అతను ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించటంతో వివాదం నెలకొనడంతో.. అతనిని వైసీపీకి చెందిన కొంత మంది కొట్టారు. దీంతో అతను మృతి చెందాడు. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో మద్యం ఎక్కువ తాగి మృతి చెందాడని నమ్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఆ కేసును రి ఓపెన్ చేసి, హత్య జరిగినట్లు పక్కా ఆధారాలను పోలీసులు సేకరించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉండటంతో ఏం జరిగిందనేది.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

35,181 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 32,350 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 35,181 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 4,211 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13500
నెంబరు. 5	10000	13300
273	---	----
341	10000	14000
4884	----	----
సూపర్ 10	---	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14100
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	12800
దేవనూరు డీలక్స్	10000	12500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9600	11000
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12700
నెంబరు. 5	10000	13400
273	---	----
341	10000	14800
4884	---	-----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13800
బ్యాడిగి	10000	12200
దేవనూరు డీలక్స్	10000	12500
తాలుకాయలు	4500	7200

జాతీయ రహదారుల విస్తరణకు..

నేడు శంకుస్థాపన

- వర్చువల్‌గా శిలాఫలకాన్ని అవిష్కరించనున్న కేంద్ర మంతి నితిన్ గడ్కరి, సీఎం చంద్రబాబు

నరసరావుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండు కీలక రహదారుల నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం శంకస్థాపన చేయనున్నారు. వర్చువల్‌గా శిలాఫలకాలను అవిష్కరిస్తారు. ఇందుకు సంబంధించిన కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చీరాల వాడరేవు చల్లగుండ్ల అడ్డరోడ్డు వరకు ఉన్న రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఫస్ట్ ఫేజ్‌లో చిలకలూరిపేట - చీరాల మధ్య పనులు వేగవంతంగా జరగుతున్నాయి. రెండో ఫేజ్‌లో చిలకలూరిపేట నుంచి చల్లగుండ్ల అడ్డరోడ్డు వరకు రహదారిని విస్తరించనున్నారు. ఇందుకు రూ 787 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఈ పనులకు నితిన్ గడ్కరి, సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారు. ఈ రహదారి నిర్మాణానికి సబంధించి చిలకలూరిపేట నుంచి ఇర్లపాడు, రావిపాడు నుంచి అడ్డరోడ్డు వరకు భూ సేకరణ దాదాపు పూర్తికావచ్చింది. ఒక్క నరసరావుపేట బైపాస్ నిర్మాణానికే భూ సేకరణ వివాదాస్పదంగా మారడంతో ప్రక్రియ నిలిచిపోయింది. 38 కిలోమీటర్ల పోడవున నాలుగు వరుసలుగా రహదారిని నిర్మించనున్నారు.

రూ.54 కోట్లతో రెంటచింతల రహదారి అభివృద్ధి

మాచర్ల దాచేపల్లి జాతీయ రహదారి 167ఏడీని వివిధ ప్రాంతాల్లో విస్తరణ రూ.54 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. ఈ పనుల శిలాఫలకాన్ని కూడా వర్చువల్‌గా కేంద్ర మంత్రి, సీఎం ఆవిష్కరిస్తారు. మాచర్ల, రెంటచింతల, గురజాల ప్రాంతాల్లో బైపాస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ రెండు రహదారుల విస్తరణతో రవాణా సౌకర్యం మరింతగా మెరుగుపడనుంది.


చిలకలూరిపేట, పర్చూరు మధ్య జరుగుతున్న రహదారి విస్తరణ పనులు

నిబద్ధతతో.. అన్నదాత సుఖీభవ

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్


కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంతో కూటమి ప్రభుత్వం రైతులకు ఆర్థిక చేయూతనందిస్తూ, నిబద్ధతతో పనిచేస్తోందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతు కుటుంబానికి కేంద్ర సాయంతో కలిపి ఏడాదికి రూ.20 వేలు అందజేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 46,85,838 రైతు కుటుంబాలు లబ్ధి పొందుతాయని తెలిపారు. ఈ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించడం జరుగుతుందన్నారు. హామీ మేరకు పథకాన్ని అమలు చేస్తూ.. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని వర్గాల అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని తెలిపారు.

జలాశయంలో మత్స్యకారుడి కోసం గాలింపు


దోనె ధనరాజు (ఫైల్)


విజయపురిసౌత్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం అనుపు కృష్ణా జలాశయంలో మత్స్యకారుడు గల్లంతైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయపురి సౌత్‌కు చెందిన దోనె ధనరాజు (40) రెండు రోజుల క్రితం అనుపు కృష్ణా జలాశయంలో చేపల వేటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై ధనరాజు సోదరుడు సన్నాసిరావు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎస్ఐ అశోక్ ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో కలిసి జలాశయంలో గాలింపు చేపట్టారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో అధికారులకు గాలింపు సవాల్‌గా మారింది.

కొడుక్కి తెలియకుండా..

తల్లి ఆస్తికే ఎసరు

- తప్పుడు ధ్రువపత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్
- ఏడుగురిపై కేసు నమోదు, అరెస్ట్
- నిందితులకు 15 రోజుల రిమాండ్

యడ్లపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు మండలం సొలస గ్రామంలో నకిలీ ధ్రువ పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను చిలకలూరిపేట అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపరచగా వారికి 15 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. వివరాల మేరకు.. సొలస గ్రామానికి చెందిన మల్లా వెంకటేష్ తల్లి మల్లా పోలమ్మ 2014 డిసెంబరులో మృతి చెందింది. అయితే ఆమె 2015 మార్చిలో తన పేరిట ఉన్న 0.76 సెంట్లు పొలం విక్రయించినట్లుగా నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె కుమారుడు వెంకటేష్ ఈ ఏడాది మే 8న యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. నకిలీ వేలిముద్రలతో విక్రయ అగ్రిమెంట్లు సృష్టించడంతోపాటు అవే డాక్యుమెంట్లతో కోర్టులో దావావేసి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్నట్లు విచారణలో తేలింది. ఇందుకు సంబంధించి గ్రామానికే చెందిన సోదరులు మల్లా పోలయ్య, మల్లా కోటయ్య, మల్లా కృష్ణ, మల్లా ఏడుకొండలు, మల్లా శ్రీను, మల్లా రమేష్, మల్లా నాంచారయ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు గురువారం చిలకలూరిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరుపరిచారు. విచారించిన న్యాయమూర్తి నిందితులకు 15 రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ తీర్పు వెలువరించారు.


సాగర్ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సాగర్ ప్రాజెక్ట్.. 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ పాజెక్ట్‌కు శ్రీశైలం నుంచి 2,57,342 క్యూసెక్కుల భారీ వరద చేరుతోంది. దీంతో శుక్రవారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్ గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్ట్ 24 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర, 2 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,09,966 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,988, కుడి కాలువ ద్వారా 8,604, ఎడమ కాలువ ద్వారా 7,684, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 , ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 2,57,342 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.20 అడుగులు ఉంది. ఇది.. 298.01 టీఎంసీలకు సమానం.

పులిచింతలకు 2.32లక్షల క్యూసెక్కులు..

రెంటచింతల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సత్రశాల నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి 14 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 గేట్లకు గాను 7 గేట్లను 3.5 మీటర్లు, మరో 7 గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి 2.32 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 75.50(7.080 టీఎంసీలు) మీటర్లు కాగా ప్రస్తుతం 74.42(6.36 టీఎంసీలు) మీటర్లు అంటే 244.2 అడుగల నీరు ఉందన్నారు. విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపి వేశామన్నారు. ఎగువన నాగార్జునసాగర్ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నామన్నారు.

పులిచింతలలో 40.44 టీఎంసీలు..

అచ్చంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పులిచింతలలో శుక్రవారం 40.44 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,12,271 క్యూసెక్కులు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, ఎనిమిది గేట్లు ద్వారా 1,88,278, లీకుల ద్వారా 400, మొత్తం 2,05,278 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోంది.

దోమల నివారణకు చర్యలు


బావిలో గంబూసియా చేపలను వేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆనందకుమార్

సత్తెనపల్లి అగస్టు 1(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఆనంద కుమార్, మలేరియా సిబ్బంది శుక్రవారం దోమల నిర్మూలనకు పలు బావులలో గంబూసియా చేపలను వదిలారు. ఇవి దోమల లార్వాలు తింటాయని కమిషనర్ అన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. దోమల నిర్మూలన చర్యలను వివరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

నేడు ముటుకూరులో అన్నదాత సుఖీభవ

● ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరులో శనివారం సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నట్లు మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మనందరెడ్డి తెలిపారు. శుక్రవారం వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పథకం కింద 38,835 మంది రైతులకు సుమారు రూ. 27.18 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నట్లు చెప్పారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి కోరారు.

హెవీ లైసెన్సు డ్రైవర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

● డిపో మేనేజర్ వీరాస్వామి

మాచర్లటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 15వ తేదీ ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నందున హెవీ లైసెన్సు డ్రైవర్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి అన్నారు. 18 నెలలు హెవీ లైసెన్సు అనుభవమున్న డ్రైవర్లు లైసెన్సు, ఆధార్ కార్డు, ఆర్టీవో కార్యాలయం జారీ ట్రాక్ట్ రికార్డుతో శనివారం ఉదయం 11 గంటలకు డిపోలో సంప్రదించాలన్నారు.

ఎంపీటీసీ ఉప ఎన్నికకు రెండు నామినేషన్లు

కారంపూడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపకంపల్లి ఎంపీటీసీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల్లో భాగంగా శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ డైరెక్టర్ సిద్ద లింగమూర్తి అన్నారు. గతంలో వైసీపీ మద్దతురాలు కోక అక్కమ్మ ఎంపీటీగా ఎన్నికయ్యారు. ఆమె అనారోగ్యంతో మృతిచెందడంతో ఉప ఎన్నిక వచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం టీడీపీ మద్దతుదారులు బొల్నేడి కనకదుర్గ (శ్రీనివాసరావు), బొల్నేడి హైమావతిలు నామినేషన్లు దాఖలు చేసినట్లు లింగమూర్తి చెప్పారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సుపరిపాలన

ముప్పాళ్ళ, అగస్టు 1(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని దమ్మాలపాడులో శుక్రవారం సుపరిపాలనో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రామంలో నిర్మించిన అంతర్గతడ్రైనేజీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమిప్రభుత్వ హామీలను 80 శాతం పూర్తిచేశామన్నారు. ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ పథకాలను వివరించారు. కూటమి నేతలు కార్యకర్తలతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు ఉన్నారు.

మంచి పౌరులుగా స్కౌట్, గైడ్స్ విద్యార్థులు

సత్తెనపల్లి, అగస్టు 1(ఆంధ్రజ్యోతి): భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం ద్వారా విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దవచ్చని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ జగదీష్‌కుమార్ గుప్తా అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం అమరావతి డివిజన్‌కు సంబంధించిన కేంద్రీయ విద్యాలయాల భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ నాలుగురోజుల క్యాంపును ఆయన ప్రారంభించారు. రూరల్ ఎస్ఐ అమీనుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులలోక్రమశిక్షణ, సామాజిక స్పృహను పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శ్రీ వాసవి కన్యకపరమేశ్వరీ అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

వాసవి మాతా కరుణించి కాపాడమ్మా..

రెంటచింతల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అమ్మా వాసవి మా త కరుణించి కాపాడమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు..శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారికి సారే సమర్పించారు. ఆలయ చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు నేతృత్వంలో వివిధ రకాల పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని సర్వాంగ సుందరంగాతీర్చిదిద్దారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

గురజాలటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకాంత్ నర్సింగ్ హోం హాస్పిటల్ డాక్టర్ చల్లగుండ్ల శ్రీరామమూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు చల్లగుండ్ల శ్రీనివాసరావు చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శనివారం పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో శంకర కంటి ఆసుపత్రి, పెదకాకాని, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యాన ఈ శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంఛన్‌గా పింఛన్

● స్పౌజ్ పింఛన్లు అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే

● ఎమ్మెల్యే యరపతినేని


స్పౌజ్ పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, చైర్‌పర్సన్ సుబ్బారావు

పిడుగురాళ్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): భర్త చనిపోతే ఆ పింఛన్‌ను అదే నెలలో భార్యకు అందించడం రాష్ట్రంలోనే తొలిసారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆగస్టుకు సాధారణ పింఛన్లతోపాటు స్పౌజ్ పింఛన్లను ఎమ్మెల్యే శుక్రవారం పిడుగురాళ్లలో పంపిణీచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా స్పౌజ్ పింఛన్లను కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గురజాల నియోజకవర్గం వ్యాప్తంగా 733 స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయన్నారు. అరాచక పాలన నుండి అభివృద్ధి చెందే ఆంధ్రప్రదేశ్ కోసం సీఎం కృషి చేస్తున్నారన్నారు. ప్రతినెల 1వ తేదీనే పింఛన్, జీతాలు ఇస్తున్న ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కేవీ సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, ఎల్‌వీఆర్, పిల్లి చెన్నారావు, పణితి రవి, కోట హరి, జొన్నలగడ్డ శ్రీను, తహసీల్దార్ జె మధుబాబు, కమిషనర్ ఐ శ్రీనివాసులు, బీజేపీ వెంకయ్య, బొల్లా శ్రీను, ఆయా వార్డుల్లో మందా డేవిడ్, సుతారు నాగమల్లేశ్వరరావు, వల్లెపు రామకృష్ణ, జమ్మిశెట్టి రామకృష్ణ, గుదె నాగ సతీష్, గండికోట వెంకటేశ్వర్లు, తదితరులు పింఛన్లు అందజేశారు.

● మాచవరం: మండల గ్రామాల్లో స్పౌజ్ పింఛన్‌లను పంపిణీ చేశారు. మాచవరం మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు 128 స్పౌజ్ పింఛన్‌లు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లో కూటమి నేతలు, అధికారులు ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు


ముప్పాళ్ల: పింఛన్ తీసుకున్నవారితో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


సత్తెనపల్లి: పింఛన్‌దారులతో నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు


సత్తెనపల్లి: పింఛన్‌లు పంపిణీ చేస్తున్న మద్దిరాల గంగాధర్

ముప్పాళ్ళ అగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కూటమి ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో శుక్రవారం ఇంటింటికీ తిరిగి వృద్ధులకు, వికలాంగులకు, లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముందుగా గ్రామంలో ఎన్టీఆర్, డాక్టర్ కోడెల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దరువూరి నాగేశ్వరరావు, గోగినేని కోటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, శిరిగిరి గోపాలరావు, డి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబం ఆనందంగా జీవించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పథకాన్ని అమలు చేస్తున్నారని రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. పట్టణంలోని 4వ వార్డులో శుక్రవారం టీడీపీ నేతలతో కలసి ఆయన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జానకిరామయ్య, జానీబాషా బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని 29వ వార్డులో వార్డు కౌన్సిలర్ జానీ బాషా, షేక్ చిన అబ్దుల్లా ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పింఛన్‌లను పంపిణీ చేశారు. 14వ వార్డులో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, వార్డు టీడీపీ అధ్యక్షుడు రమేష్, సచివాలయ సిబ్బంది పింఛన్‌లను పంపిణీ చేశారు. నూతనంగా మంజూరైన వితంతు పింఛన్‌లను అన్ని వార్డుల్లో సచివాలయ సిబ్బంది, టీడీపీ నేతలు పంపిణీ చేశారు. పట్టణంలోని వడ్డవల్లిలో కౌన్సిలర్ కంభంపాటి అబ్రహం, టీడీపీ నేతలు బండారు నాగరాజు తదితరులు పింఛన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లూరి కిరణ్ కుమార్, గోన జయబాబు, కంభంపాటి మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక భద్రత పింఛన్‌లతో పాటు స్పౌజ్ పింఛన్‌ల పంపిణీ శుక్రవారం జరిగింది. ఉదయాన్నే ఆరు గంటల నుంచి సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల గృహాలకు వెళ్ళి పింఛన్‌లను పంపిణీ చేశారు. మండలంలోని ఫణిదంలో పింఛన్‌లను మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, గ్రామ టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ సుబ్బారావు, నిమ్మగడ్డ అర్జునరావు, కోట కాళి దాసు, కొల్ల కోటేశ్వరరావు, మదమంచి నాగ గోపాల్, చింతా అశోక్, పీఏసీఎస్ చైర్మన్ ఎర్రగుంట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● రాజుపాలెం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం పండుగ వాతావరణంలో స్పౌజ్ పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ సత్యానారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు అంచుల నరసింహరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సొంత కార్యకర్తలకే జగన్ మోసం


అమరావతి: వితంతు పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


అచ్చంపేటలో పింఛన్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ, టీడీపీ నాయకులు


క్రోసూరులో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు వైనాట్ 175 అని సొంత పార్టీ నాయకులను, కార్యకర్తలను మభ్యపెట్టి ఓటమితో అబాసుపాలైన మాజీ సీఎం జగన్‌రెడ్డి మరలా మూడు సంవత్సరాలలో తాను ముఖ్యమంత్రి అవుతానని అసత్య ప్రచారం చేస్తూ కార్యకర్తలను మరోసారి వంచన చేస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం అమరావతిలోని పట్నం మాలపల్లెలో నూతన వితంతు పెన్షన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మిగిలిన గ్రామాలలో స్థానిక నాయకులు పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ లిక్కర్ స్కాం ఓ వైపు తరుముకువస్తుంటే వైసీపీ కార్యకర్తలు, నాయకులలో కలుగుతున్న భయాందోళనలను తొలగించేందుకు జగన్‌రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం హనుమంతరావు, తహసీల్దార్ డానియేలు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో పద్మజ, మండల పార్టీ అధ్యక్షుడు ఎం రాజా, పీఏసీఎస్ అధ్యక్షుడు జగదీష్, కిరణ్ పాల్గొన్నారు.

● అచ్చంపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వితంతువులకు కూటమి ప్రభుత్వం అండగా ఉండేలా పింఛన్‌లను పంపిణీ చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అన్నారు. శుక్రవారం మండలంలో 181మందికి స్పౌజ్ పింఛన్‌లను అందజేశారు. ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ, టీడీపీ నాయకులు అచ్చంపేటలో ఇల్లిల్లు తిరుగుతూ పింఛన్‌లను పంపిణీచేశారు. వెనిగండ్ల కోటయ్య, ఎస్‌కే జానీ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రమేష్, పీఎస్ పంతులునాయక్, భూక్యా రమేష్, టి.ఆంజనేయులు, కోటా చంటి ఉన్నారు.

● క్రోసూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలో 124మందికి కొత్త పింఛన్‌లు మంజూరైనట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే 98 శాతం పింఛన్‌ల పంపిణీ పూర్తయిందన్నారు. పలువురు టీడీపీ నాయకులు క్రోసూరు ఎస్సీ కాలనీలో పింఛన్‌ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మినేని సతీష్, మొగల్ జాన్, శ్రీనివాసరావు, షై సూర్ బాబు, డాక్టర్ షరీఫ్, ఏ వెంకట రామిరెడ్డి, యోహాన్, రామాంజనేయులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం నూతన పింఛన్‌ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, ఓర్సు ఆనంద్, సయ్యద్ జానీ, సర్పంచ్ జ్యోతిసముద్రం, రసూల్, టి.సత్యనారాయణ, సయ్యద్ మజీద్, రాంబాబు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వితంతువులకు స్పౌజ్ పింఛన్‌లను పంపిణీ చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడులో పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం స్పౌజ్ పింఛన్‌ల కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు అర్తిమళ్ళ రమేష్, గల్లా బాబూరావు, గుడిపూడి రాజు పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు మేదరమెట్ల సౌమిత్‌చౌదరి, బెల్లంకొండ రామగోపాలరావు, షేక్ అజ్మల్లా, షేక్ మిలటరీ మౌలాలి, ఎం.వెంకట సత్యనారాయణ, బి.సుదర్శనరావు, జి.లీలావతి, వి.మురళీ, ఎంపీడీవో సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం


స్పౌజ్ పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి


రెంటచింతల: పింఛన్ పంపిణీ చేస్తున్న అబ్బిరెడ్డి తదితరులు

మాచర్లటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి అన్నారు. ప్రభుత్వం మంజూరుచేసిన స్పౌజ్ పింఛన్లను శుక్రవారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఇప్పటికే తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్, అందరికీ తాగునీరు వంటి అనేక పథకాలను అమలుచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీనేతలు పాల్గొన్నారు.

● ఎన్టీఆర్ భరోసా పింఛన్ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు కొండంత భరోసానిస్తుందని టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లను అందించారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బండ్ల బ్ర హ్మం, చందుగౌడ్, పిన్నెంశెట్టి కృష్ణ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి చేరాయని టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి అన్నారు.శుక్రవారం రెంటచింతలలో నూతనంగా మంజూరైన 23 స్పౌజ్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు, ఈవో శ్రీకాంత్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, ఎం.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

● విజయపురిసౌత్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతుందని టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి అన్నారు. శుక్రవారం స్థానికంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆడెపు కోటయ్య, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు పైలపల్లి అప్పలరాజు, కట్టా రాజు, ఘంటా ధనుంజయరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, మాజీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, విద్యా కమిటి చైర్మన్ రమావత్ బాలునాయక్‌లు లబ్ధిదారులకు పెన్షన్లను అందించారు. మండలంలోని ఇనుపరాజుపల్లిలోనూ వీరు పెన్షన్లను అందించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, తండా మస్తాన్‌జానీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● గురజాలటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్పౌజ్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం పట్టణ, మండల పరిధిలో అధికారులు, కూటమి నేతలు ప్రారంభించారు. భర్త పింఛన్ పొందుతూ మరణించగా తదుపరి భార్యకు వర్తించేలా ఈ పింఛన్ అందిస్తున్నట్లు నేతలు చెప్పారు.

శ్రావణ శుక్రవారం పూజలు


వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని పూలతో అలంకరించిన దృశ్యం

సత్తెనపల్లి అగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఆలయ కమిటీ నిర్వాహకులు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

● దాచేపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం శుక్రవారం దాచేపల్లిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి, శ్రీ వీర్లంకమ్మతల్లి దేవాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, లలితా పారాయణం, కనకధార స్తోత్రం, ఖడ్గమాల పారాయణం నిర్వహించారు. అంకమ్మ తల్లి దేవాలయంలో దేవస్థాన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

● పిడుగురాళ్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం కనకదుర్గ అమ్మవారిని వివిధ రకాల పండ్లతో విశేషంగా అలంకరించారు. పట్టణంతో పాటు పలు గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణ మాస పూజలు నిర్వహించారు.

మాచర్ల పట్టణ బైపాస్‌కు మహర్దశ

మాచర్లటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో నేషనల్ హైవే ఎన్‌హెచ్ 167ఏడీ బైపాస్ నిర్మాణ పనుల కోసం కేంద్ర రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ మంత్రి నితిన్ గడ్కారీ మంగళగిరిలోని సీకె కన్వెన్షన్‌లో శనివారం శంకుస్థాపన చేయనున్నారు. మాచర్ల పట్టణంలోని రింగురోడ్డు నుంచి నరసరావుపేట రోడ్డులోని శివప్రియ నగర్ వరకు హైవే నిర్మాణ పనులు జరగనున్నాయి. అలాగే రెంటచింతల ఔటర్ పావస్ నుంచి టౌన్ వరకు, గురజాల ఆటో బైపాస్ నుంచి బస్టాండ్ వరకు మొత్తం 13 కి.మీ.ల మేర రూ. 54 కోట్లతో బైపాస్ నిర్మాణాలు జరగనున్నాయి. దీంతో మాచర్ల పట్టణ రూపురేఖలు మారనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి తెలిపారు.

సంక్షిప్తం...

● దాచేపల్లి: అరక దున్నేందుకు ఎడ్లజతతో వెళ్తున్న రైతును లారీ ఢీకొనటంతో ఎడ్ల జత మృతిచెందాయి. గామాలపాడు గ్రామానికి చెందిన దమ్మాలపాటి గంగరాజు పత్తిపొలంలో అరక దున్నేందుకు తెల్లవారుజామున హైవేపై ఎడ్లను తోలుకుంటూ పొలానికి వెళ్తున్నాడు. గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వెనుక వైపుగా వచ్చి రైతును, ఎడ్లను ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు ఎద్దులు మృతిచెందాయి. రైతు దమ్మాలపాటి గంగరాజుకు తీవ్ర గాయాలు కాగా పిడుగురాళ్ళ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందజేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● మాచవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టి నిర్వహిస్తున్న స్వమిత్వ సర్వేకి గ్రామంలోని ప్రతి ఒక్కరు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి ఉషారాణి సూచించారు. శుక్రవారం స్వమిత్వ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ దొండేటి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఉన్న అన్ని గృహాలను, ఖాళీ స్థలాలను సర్వే చేసి హద్దులు గుర్తించటం జరుగుతుందన్నారు.

● సత్తెనపల్లి: శ్రావణ శుక్రవారం సందర్భంగా సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్రతంలో పాఠశాల అధ్యక్షుడు దేవరశెట్టి రవికుమార్, కార్యదర్శి చలువాది చినసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మహారాష్ట్రవీధి భక్తాంజనేయ దేవస్థానంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

● సత్తెనపల్లి రూరల్: ముందస్తు జాగ్రత్తలతో డెంగీవ్యాధిని నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బీ రవి అన్నారు. మండలంలోని కొమెరపూడిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. బావుల్లో, నీటి కుంటల్లో గంబూసియా చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, ఫణిదం పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి, ఎర్ర వెంకటేశ్వరరావు, మలేరియా వైద్య, ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● మండలంలోని కట్టమూరు సంగం డెయిరీ పాలకేంద్రం పాల ఉత్పత్తిదారులకు శుక్రవారం బోనస్ పంపిణీ చేశారు. మొత్తం 116మంది రైతులకు రూ.4,64,174 బోనస్‌ను సంగం డెయిరీ డైరెక్టర్ పోపూరి శేషగిరి కుమారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాడిబోయిన గోపీ, పాశం కోటేశ్వరరావు, కంచేటి వెంకటరావు, ఎం.హనుమంతరావు, రామచంద్రరరావు పాల్గొన్నారు.

● మండలంలోని దీపాలదిన్నెపాలెంకి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త పిల్లకతుపు కోటేశ్వరరావు(55) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ పాటిబండ్ల పూర్ణచంద్రరరావు, గ్రామ టీడీపీ నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. మృతుని భార్యకు రూ.10వేలు యార్డు డైరెక్టర్ పాటిబండ్ల పూర్ణచంద్రరరావు అందజేశారు.

● సత్తెనపల్లి: పట్టణంలోని గీతామందిరం అభివృద్ధికి జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకటప్పారావు రూ.2లక్షల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా అప్పారావును కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కూరపాటి శంకర్, దివ్వెల శ్రీనివాసరావు, జువ్వాజి రామ్మోహన్‌రావు, దేవరశెట్టి రవికుమార్, కొత్త లక్ష్మయ్య, రంగిశెట్టి సుమన్, బత్తుల కేశవ తదితరులు పాల్గొన్నారు.

● రాజుపాలెం : టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా అనుపాలెం గ్రామానికి చెందిన నల్లగొర్ల పెద్ద ఆంజయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా నల్లగొర్ల ఆంజయ్య శుక్రవారం ఎమ్మెల్యే కన్నాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని కన్నా శాలువతో సత్కారించారు.

● మండలంలోని బీరవల్లిపాయ గ్రామంలో శుక్రవారం సత్తెనపల్లి పట్టణంలోని సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 100 మందికి పైగా పాల్గొన్నారు. వైద్యులు సింగరాజు సాయికృష్ణ, విద్య పాల్గొని బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

● నకరికల్లు: నిత్యావసరాలను రేషన్ డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ పుల్లారావు ఆదేశించారు. శుక్రవారం ఆయన రేషన్ షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ సక్రమంగా ఉండాలని సూచించారు. పంపిణీ సక్రమంగా చేయకపోయినా, స్టాక్‌లో వ్యత్యాసం ఉన్నా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో పంపిణీ చేస్తున్న గ్యాస్ నిర్దేశిత ధర ప్రకారమే అందజేయాలని తహసీల్దార్ డీలర్‌ను ఆదేశించారు. నకరికల్లులో శుక్రవారం గ్యాస్ డీలరు, డెలివరీ బాయిస్‌తో సమావేశం నిర్వహించారు.

● అచ్చంపేట: మండలంలోని పెదపాలెంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించినట్టు పెదపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ కే పద్మ తెలిపారు. తల్లిపాలు తాగిన బిడ్డలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. అనంతరం పెదపాలెంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అచ్చంపేట పీహెచ్‌సీ డాక్టర్ స్రవంతి, ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, తల్లులు, గర్భవతులు, బాలింతలు హాజరయ్యారు.

● అమరావతి: రైతులకు మెరుగైన సేవలందించి మన్ననలు పొందిన నరుకుళ్లపాడు పీఏసీఎస్‌కి ఆప్కాబ్ ఉత్తమ పురస్కారం ప్రకటించింది. ఈనెల 4 తేదీ ఆప్కాబ్ వ్యవస్థాపక దినోత్సవం రోజున విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని సంఘ ప్రతినిధులకు ప్రదానం చేయనున్నారు. నరుకుళ్లపాడు పీఏసీఎస్ పాలకమండలి ప్రమాణ స్వీకారం 3వ తేదీ జరుగనుంది.

● బెల్లంకొండ: చంద్రాజుపాలెంలో పారిశుధ్య కార్మికులకు రెండు రిక్షాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరసరావుపేట బీసీ పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస నాయక్, ఈవోపీఆర్‌డీ గిరిధర్‌రెడ్డి, అధ్యక్షుడు ఓర్సు రాంబాబు, శ్రీనివాసరావు, గుంజా శివ, బాబు, బసవయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు: తల్లి పాలివ్వటం వల్ల తల్లి బిడ్డకు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యరక్షణ ఉంటుందని 75 తాళ్ళూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక అన్నారు. తల్లిపాల వారోత్సవాల భాగంగా తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వెలుగొండారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో వెంకట రమణ, సూపర్ వైజర్ మాధవి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

● శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని పెదకూరపాడులో అంకమ్మ తల్లి శోభాయాత్రను నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బెల్లంకొండ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలేరమ్మ తల్లి ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు దుప్పటి చినబాబు, కరణం శ్రీనివాసరావు, అర్తిపట్ల వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల: రెంటచింతలలోని బీసీ బాలుర,బాలికల,ఎస్సీ బాలుర,గిరిజన సంక్షేమ వసతి గృహాలను ప్రత్యేకాధికారి కె.రాముబాలాజీ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు,ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు,ప్రిన్సిపాల్ మోహన్,వార్డెన్లు సుశీల,బేగ్,అంజి తదితరులున్నారు.

● మాచర్ల రూరల్: పట్టణంలోని 26, 27 వార్డుల్లో శుక్రవారం టీడీపీ నేతలు పెన్షన్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, అన్వర్‌బాషా, మొయిన్, మొహిద్దీన్, జానీబాషా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● హౌసింగ్ శాఖ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలని కోరుతూ హౌసింగ్ ఉద్యోగులు రాష్ట్ర హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం శివప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం విజయవాడలోని హౌసింగ్ శాఖా కార్యాలయంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సాతులూరి మరియదాసు, జిల్లా సెక్రటరీ అలీ, మహేంద్ర, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

● దుర్గి: మొక్క లేనిదే జీవరాశికి మనుగడ లేదని నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని ఓబులేశునిపల్లెలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతాసాయి శంకర్, ఎంపీడీవో సత్యప్రసాద్, ఏవో శివప్రసాద్, ఏపీవో మల్లికార్జునరావు, దుర్గెంపూడి జానకి రామయ్య, లింగా రమేష్, పసుమర్తి వెంకటేశ్వర్లు, ఉన్నం మహేష్, మాగులూరి శ్రీనివాసరావు, మొగిలి బాలశ్రీను, ఒట్టికొండ వెంకటేశ్వర్లు, అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

● కారంపూడి శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా పట్టణంలో ని అంకాళమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు.

● అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద ప్రభుత్వం రూ.4.53 కోట్లు విడుదల చేసినట్లు ఏవో నరసింహారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 6465మంది రైతులకు శనివారం నగదు విడుదలవుతుందన్నారు.



వాసవి మాతకు పసుపుతో అభిషేకం

పొన్నూరుటౌన్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో వేంచేసిన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 108 కేజీల పసుపుతో వాసవి మాతను అభిషేకించారు. భక్త బృందం ఆధ్వర్యంలో లలిత సహస్ర నామ పారాయణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

సమఉచితంగా.. ఆమె అనుకున్నట్టు జీవించేలా!

- పేదింటి మహిళలకు ప్రభుత్వం చేయూత
- ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ
- అనంతరం ఫ్రీగా మిషన్ల పంపిణీ



వేమూరు కేంద్రంలో కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళలు

వేమూరు, ఆగస్టు 01 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదింటి మహిళలకు.. ఆర్థిక స్వావలంబన కల్పించే దిశలో కుట్టు మిషన్ ఉచిత శిక్షణ చేయూతను అందిస్తోంది. స్వయం ఉపాధితో వారు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది. తొలి దశలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో.. ఫేజ్-1లో వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండల కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఒక్కో కేంద్రంలో ఇద్దరు మహిళా శిక్షకులను నియమించారు. 400 మంది మహిళలు శిక్షణకు హాజరవుతున్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం ప్రభుత్వం నాణ్యమైన కుట్టు మిషన్లను వారికి ఉచితంగా పంపిణీ చేయనుంది. ఒక కుట్టు మిషన్ ఖరీదు రూ.7 వేలు దాకా ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత పరీక్ష నిర్వహిస్తారు. టైలరింగ్ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకునేందుకు.. ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని మహిళలు చెబుతున్నారు.

ప్రభుత్వం రాబోయే రోజుల్లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షా రెండు వేల మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నారు. ప్రతి నియోజకవర్గానికి మూడు వేల మంది మహిళలకు కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఫేజ్-1, 2, 3 విభాగాల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. శిక్షణ సమయంలో ఉదయం, సాయంత్రం ముఖ ఆధారిత హాజరు తీసుకుంటున్నారు. కేవలం బీసీ మహిళలే కాకుండా ఆర్థికంగా వెనుబడిన కుటుంబాలకు చెందిన మహిళలను కూడా గుర్తించి వారికి శిక్షణ ఇస్తున్నారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు మహిళలను గుర్తిస్తున్నారు. కుల ధ్రువీకరణ, ఆధార్, వయసు, ఆదాయ ధ్రువపత్రాల దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా వీటిని జతపరచాలి. వితంతువులు, దివ్యాంగ మహిళలు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. హాజరు విషయంలో 85 శాతం తగ్గకుండా ఉండాలని కూడా నిబంధన పెట్టారు. మహిళలు ఎంతో ఉత్సాహంతో శిక్షణలో పాల్గొంటున్నారు. కూటమి ప్రభుత్వానికి, మహిళల స్వయం ఉపాధి కోసం ప్రత్యేక ఆలోచనలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



మహిళల స్వయం ఉపాధి కోసం.. ఉచితగా కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాలతో పాటు అనేక పథకాల ద్వారా చేయూతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతగానో రుణపడి ఉంటామని శిక్షణలో పాల్గొన్న వరహాపురానికి పులివర్తి నాగలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు. మెరుగైన విధానంలో శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు.

బాబు పాలనలో..

ప్రాజెక్టులన్నింటికీ.. జలకళ

- 75 రోజుల్లో వెల్లటూరు ఆక్విటెక్ పూర్తి
- 35 వేల ఎకరాలకు సాగునీరు
- ప్రారంభోత్సవంలో మంత్రి అనగాని



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి అనగాని, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, కలెక్టర్ వెంకటమురళి

రేపల్లె, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ నిండుకుండలా కళకళలాడుతున్నాయని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌పై నిర్మించిన వెల్లటూరు ఆక్విటెక్‌ను మంత్రి అనగాని ఎమ్మెల్యే ఆనంద్‌బాబు, కలెక్టర్ వెంకటమురళితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన 75 రోజుల్లోనే ఆక్విటెక్‌ను నిర్మించడం ఓ రికార్డుగా పేర్కొన్నారు. రైతులకు ఖరీఫ్ సీజన్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రూ.10.75 కోట్లతో నిర్మించిన ఈ ఆక్విటెక్ ద్వారా వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని 35 వేల ఎకరాల సాగు నీరు సౌకర్యం కలుగుతుందన్నారు. గత వైసీపీ పాలనలో కనీసం మరమ్మతులు కూడా నిర్వహించకపోవడంతోనే ఆక్విటెక్ గతేడాది కూలిపోయిందన్నారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో.. యుద్ధ ప్రాతిపదికన ఆక్విటెక్ పనులు పూర్తిచేశామన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీలో కాల్వలు, డ్రెయిన్లకు కనీస మరమ్మతులు నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. కృష్ణా పశ్చిమడెల్టాలో రూ.వందల కోట్లు వెచ్చించి కాల్వలు, డ్రెయిన్ల మరమ్మతులు నిర్వహించి చివరి భూముల వరకు సాగు నీరు అందించేలా కృషి చేశామన్నారు. ఆక్విటెక్‌ను మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ తక్కువ కాలంలో రైతుల ప్రయోజనాల కోసం దగ్గరుండి పూర్తి చేయించారని కొనియాడారు. అయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ రైతుల కోసం ఆక్విటెక్ నిర్మాణం తక్కువ కాలంలోనే పూర్తి చేయడం జరిగిందని, రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత వెల్లటూరు మెయిన్ కెనాల్ నుంచి భట్టిప్రోలు కాల్వకు పూజలు నిర్వహించి, సాగునీటిని మంత్రి అనగాని, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, కలెక్టర్ వెంకటమురళి విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, ఆర్డీఓ రామలక్ష్మి, కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం, డ్రెయినేజీ ఈఈ ప్రేమ్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ సుధాకర్, క్వాలిటీ కంట్రోల్ డీఈ నాగబాబు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు,తాతా ఏడుకొండలు, వేమూరు ఏఎంసీ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, భట్టిప్రోలు పీఏసీఎస్ పరుచూరి రమేష్, భట్టిప్రోలు టీడీపీ అధ్యక్షుడు నూతక్కి దినకరబాబు తదితరులు పాల్గొన్నారు.

గుత్తేదారి ఆ చెట్లనూ నరికేస్తున్నారు

వేమూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మూతపడ్డ జంపని షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలోని చెట్లను టెండర్‌పై దక్కించుకున్న కాంట్రాక్టర్ హద్దు మీరారు. ఆర్‌అండ్‌బీ పరిధిలోని చెట్లను కూడా నరికి వేశారు. ఫ్యాక్టరీకి సంబంధించిన 77 ఎకరాల భూమిలో ఉన్న చెట్లను పూర్తిగా తొలగించేందుకు.. రూ.55 లక్షలకు టెండర్ పద్ధతిలో కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇందులో భాగంగా ఫ్యాక్టరీ, ఉద్యోగుల నివాస గృహాలు, ఫ్యాక్టరీకి చెందిన మాగాణి భూముల ప్రాంగణాల్లోని చెట్లను మాత్రమే అతను నరికి తరలించుకోవాల్సి ఉంది. కానీ, ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లోని చెట్లను కూడా నరికి తరలిస్తున్నారు. దాతలు, ప్రభుత్వం ఎంతో కాలం క్రితం నీడనిచ్చే ఈ చెట్లను పెంచడం జరిగింది. ఈ చెట్లను నరికి తరలిస్తుంటే ఆర్‌అండ్ బీ శాఖ, జంపని గ్రామ పంచాయితీ శాఖ చోద్యం చూడటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫ్యాక్టరీ సమీపంలోని ఆర్‌అండ్‌బీ పరిధిలో నరికేసిన వృక్షాలు



దొంగలు దొరికారు

(3వ పేజీ తరువాయి)

వెలుగులోకి వచ్చాయి. ఒక్క సూర్యలంకలోని హరిత రిసార్టు పేరిటనే 49 ఫిర్యాదులు వచ్చాయి. ఏపీ, తెలంగాణలో కలిపి 59 ఫిర్యాదులు రాగా దేశంలోని 18 రాష్ట్రాల పరిధిలో 127 ఫిర్యాదులు నమోదయ్యాయి. అయితే రాజస్థాన్‌లో రెండు, బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఒక్కటి మాత్రమే కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో సైబర్ నిందితులను పట్టుకోవడానికి బాపట్ల జిల్లా పోలీసులు దాదాపు ఏడాది పాటు శ్రమించి ముఠా గుట్టురట్టు చేశారు. సూర్యలంక తీరంలోని హరిత రిసార్ట్ పేరితో 49, తిరుమల, శ్రీశైలం, త్రయంబకేశ్వర్ దేవస్థానాల పేరిట 11, మేరు మహాదేవ్ రిసార్ట్ పేరుతో 2 నకిలీ వెబ్‌సైట్లు, ఇతర హోటల్ గదుల బుకింగ్ మోసాలు 12తో పాటు ఓఎల్‌ఎక్స్ స్కామ్‌లు, ఫేక్ ఐడెండిటీలు, యూపీఐతో పాటు ఇతర ఆన్‌లైన్ మోసాలు 52 వరకు చేసినట్లు పోలిసులు ప్రాథమికంగా తేల్చారు. ఈ నకిలీ సైట్ల ద్వారా సుమారు రూ.50 లక్షలు కొల్లగొట్టారని నిర్ధారించారు. అమాయకపు విద్యార్థులకు డబ్బు ఆశచూపి వారి చేత బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయించి ఆ అకౌంట్ నంబర్లనే వెబ్‌సైట్లలో మార్చిమార్చి ఉంచి మోసాలకు తెరతీశారు. అక్కడ నుంచి మరో ఖాతాకు ఇలా దాదాపు 5 అకౌంట్లు మారిన తర్వాతనే తమ ఖాతాలకు సొమ్ము వచ్చేలా నిందితులు జాగ్రత్త పడ్డారు. ఎండ్ యూజర్‌ల వివరాలు రాజస్థాన్‌లోని డిగ్ జిల్లా సహాసన్ ప్రాంతం అని పోలీసుల విచారణలో తేలింది. అక్కడ రెండు వారాలు దర్యాప్తు చేపట్టిన పోలీసులు జూలై 23న పరంజిత్(20), బిట్టూ(21)లను అదుపులోకి తీసుకుని వారి నుంచి 5జీ మొబైల్‌తో పాటు రెండు సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అక్కడ స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ రిమాండ్ ద్వారా గుంటూరు జిల్లా జైలుకు తరలించిన పోలీసులు విచారణ కోసం నిందితులను రెండురోజుల పాటు కస్టడీలోకి తీసుకున్నారు. ఈ సైబర్ నేరాల వెనక మరికొంత మంది కూడా ఉన్నారని వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

రెండు టీంలు.. పక్కా ప్రణాళికతో

ఈ కేసు విచారణకు సంబంధించి రెండు టీంలను ఎస్పీ తుషార్ డూడీ నియమించారు. ఏడుగురు పోలీసులతో ఐటీ సైబర్ కోర్ టీంను, ఐదుగురు పోలీసులతో విచారణ అండ్ ఫీల్డ్ టీం ఇంకోదానిని ఏర్పాటు చేసి నిత్యం దర్యాప్తు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

పురోగతిని పర్యవేక్షించారు. బ్యాంకు ఖాతాలు మొదలుకుని ఐఎఫ్ఎస్‌సీ కోడ్ల వరకు ఏ ఒక్క సాంకేతిక అంశాన్ని వదలకుండా జల్లెడ పట్టారు. ఐపీ అడ్రస్‌లను నిత్యం ట్రాక్‌లో ఉంచుతూ మూలాలు తెలుసుకోవడంలో విజయం సాధించారు. పోలీసు విచారణలో భాగంగా తొలుత ముగ్గురు విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోకి ఈ నగదు వెళ్లినట్లు గుర్తించారు. వీరంతా కూడా రాజస్థాన్‌కు చెందిన వారు కావడంతో అక్కడకే వెళ్లి విచారణ చేపట్టారు. అమాయక విద్యార్థులను ఎరగా వేసి సైబర్ నేరగాళ్ల పబ్బం గడుపుకున్నారని పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత పక్కా ఆధారాలతో రెండోసారి రాజస్థాన్ వెళ్లిన పోలీసులు దాదాపు రెండు వారాల పాటు అక్కడ విచారణ జరిపి నిందితులను గుర్తించారు. రాజస్థాన్‌లోని డిగ్ జిల్లాలోని సహసన్ ప్రాంతానికి కొత్త వ్యక్తులు వెళ్లడం దాదాపు అసాధ్యం. పైగా అక్కడ స్థావరం ఏర్పాటు చేసుకున్న నిందితులు బయటి నుంచి ఆ ప్రాంతలోకి ఎవరైనా వ్యక్తులు వస్తే తెలిసే విధంగా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో రెండు సార్లు ప్రయత్నించి విఫలమైన పోలీసులు అక్కడ స్థానికంగా ఉన్న ఫారెస్ట్ అధికారి సాయంతో ఎట్టకేలకు నిందితులను అదుపులోకి తీసుకోగలిగారు.

ప్రత్యేక అభినందనలు తెలిపిన ఎస్పీ

ఎన్నో కష్ట నష్టాల కోర్చి ఈ కేసును ఛేదించిన రెండు టీంలను ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సమయంలో నకిలీ వెబ్‌సైట్ల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని, గదులు బుకింగ్ చేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ మోసాల బారిన పడిన వారు టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ తుషార్ డూడీ కోరారు.

తింటే తిప్పలే!

- రంగులు, నిల్వ మాంసంతో తయారీ
- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిస్తున్న హోటళ్లు
- డబ్బులు ఇచ్చి జబ్బులను ఆహ్వానిస్తోన్న ఆహారప్రియులు
- నిబంధనల ఊసే కరువు.. పత్తాలేని ఫుడ్ సేఫ్టీ విభాగం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు బిర్యానీ అంటే నగరాలు, పెద్దపెద్ద పట్టణాలకే పరిమితం. ప్రస్తుతం బిర్యానీ సెంటర్లు మండల కేంద్రాల నుంచి ఓ మోస్తరు పెద్ద గ్రామాలకూ విస్తరించాయి. బిర్యానీ అంటే చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా భుజించడానికి ఇష్టపడతారు. ఇదే అవకాశంగా తక్కువ ధర అంటూ కూల్‌డ్రింక్ ఉచితం అంటూ రకరకాల ఆఫర్లతో ఆహార ప్రియులను ఆకర్షిస్తూ బిర్యానీ సెంటర్లను విస్తరిస్తున్నారు. జిల్లా కేంద్రాలైన గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలతో పాటు మున్సిపల్ పట్టణాల్లో కరోనా అనంతరం వందల సంఖ్యలో బిర్యానీ సెంటర్లు వెలిశాయంటే వాటికి ఉన్న డిమాండ్ అర్థమవుతోంది. అందరికీ అందుబాటు ధరలో లభ్యమవుతోన్న బిర్యానీలో నాణ్యత ఎంత అంటే ఎవరూ చెప్పలేరు. లాభార్జనే ధ్యేయంగా కాసుల వేట సాగిస్తున్న నిర్వాహకులు ప్రజల ఆరోగ్యాలను పణంగా పెడుతున్నారు. కనులకు ఇంపుగా ఉండడం కోసమో, కృత్రిమ రుచుల కోసమో బిర్యానీతో పాటు ఇతర మాంసాహార వంటకాలలో విపరీతంగా ప్రమాదకరమైన రంగులు కలుపుతున్నారు. వీటిని కలపడం వల్ల ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలను వినియోగదారులు కొని మరీ తింటున్నారు. వాడిన నూనెనే తిరిగి వాడడం మొదలుకుని, అపరిమితంగా ఫుడ్ కలర్ వాడడం వల్ల ప్రజల ఆరోగ్యాలకు ఎన్నో అనర్థాలు వాటిల్లుతున్నాయి. నాణ్యత విషయంలో తోపుడుబండ్ల దగ్గర నుంచి కాస్ట్లీ రెస్టారెంట్ల వరకు అదే దారి. పెద్ద రెస్టారెంట్ల వైపు కన్నెత్తి చూడని అధికారులు, రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని తూతూమంత్రంగా తనిఖీలు



చేపడుతున్నారన్న విమర్శలున్నాయి

డబ్బులు ఇచ్చి మరీ రోగాలకు ఆహ్వానం

రెస్టారెంట్లు మొదలుకుని రోడ్డు పక్కన హోటళ్ల వరకు జిల్లా వ్యాప్తంగా వేలల్లో ఉన్నాయి. ఇందులో అధికారికంగా రిజిష్టర్ అయినవి 20 శాతంలోపే. వీటిలో పెద్ద చిన్నా అన్న తేడా లేకుండా చాలావరకు హోటళ్లు, ఫుడ్, బిర్యానీ సెంటర్లలో ఆహార భద్రత నిబంధనలను పాటించే వారే లేరు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో రోజువారీ ఓపీల్లో దాదాపు 14 శాతం ఫుడ్‌పాయిజన్ సమస్యగానే నమోదవడం కల్తీ తీవ్రతకు అద్దం పడుతోంది. గ్యాస్ట్రో ఎంట్రాలజీ కేసులు కూడా పెద్దఎత్తు వస్తున్నాయి. నాణ్యత లేని ఆహార పదార్థాలతో గుండె, నరాలు, ఎముకల సమస్యలు తలెత్తడంతో పాటు చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని వైద్యులు గుర్తించారు. కృత్రిమ రంగులు కలిపిన ఆహార పదార్థాలతో క్యాన్సర్ పొంచి ఉంది. పదార్థాల్లో కలిపే కెమికల్స్ వల్ల మహిళల్లో రుతుసంబంధమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. వేడివేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లు, బకెట్లు, డబ్బాల్లో ప్యాక్ చేస్తుండటం వల్ల కూడా క్యాన్సర్ కారక పదార్థాలు కొని మరీ తింటున్నారు.

నిబంధనల ఊసే లేదు

ఆహార పదార్థాల్లో కల్తీని నివారించడానికి ఏర్పాటు చేసిన ఆహార భద్రత, ప్రమాణాల చట్టం అమలు గురించి ఆలోచించే వారే లేరు. నిత్యం తనఖీలు చేపట్టి నిబంధనలు అమలవుతున్నాయో పరిశీలించి కల్తీలను అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు బాధ్యతను విస్మరిస్తున్నారు. ఆహార భద్రతా చట్టం ప్రకారం 19 నిబంధనలు పాటించాలి. కానీ ఏ హోటల్, ఫుడ్‌సెంటర్‌లో వీటి జాడే కనబడదు. కల్తీ, కలుషిత, విష తుల్య ఆహార పదార్థాలను అడ్డుకోవాలన్న ఆలోచన ఆయా శాఖాధికారుల్లో లోపించింది. ఆహార పదార్థాలను నిత్యం పరిశీలిస్తూ కఠిన చర్యలకు ఉపక్రమించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఆయా హోటళ్లలో వినియోగించే రంగుల డబ్బాలు, టేస్టింగ్ సాల్ట్ ప్యాకెట్లు బహిరంగంగానే దర్శనమిస్తున్నా అధికారులకు అవి కనబడడం లేదు. పెద్దఎత్తున బిర్యానీ హోటళ్లు వెలసి, రకరకాల ఆఫర్లు, కల్తీరంగులతో వినియోగదారులను ఆకర్షిస్తుంటే ఈ కల్తీదందా ఏదీ సదరు విభాగానికి కనబడకపోవడం మరింతగా విస్మయపరిచేదిలా ఉంది. పెద్ద సంఖ్యలో ఉన్నారు.

ఐసీడీఎస్‌కు మాతృ వందనం

సత్తెనపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల్లో రక్త హీనత నిర్మూలనకు అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృ వందన యోజన, జననీ సురక్ష యోజన నిర్వాహణ బాధ్యతలను ప్రభుత్వం ఐసీడీఎస్‌కు అప్పగించింది. ఇప్పటి వరకు మాతృ వందనం అమలు బాధ్యతను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చూసింది. ఇప్పుడు పూర్తిగా ఐసీడీఎస్‌కు అప్పగించింది. రెండు పథకాల నగదు రూ.6 వేలు మూడు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో గర్భిణుల నమోదును పునఃప్రారంభిస్తారు. కేంద్రా ల కార్యకర్తలకు ప్రత్యేక లాగిన్‌లు కేటాయించారు. గర్భిణుల ఆధార్ సంఖ్యతో నమోదుకు శ్రీకారం చుడతారు.

10,715 మంది గర్భిణులు

పల్నాడు జిల్లాలో 10,715 మంది గర్భిణులు, 9,671 మంది బాలింతలున్నారు. వీరిలో దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న వారికి మాతృ వందనం పథకం నగదు అందనుంది.

ఆ రెండు నెలలు ఎలా?

ప్రధానమంత్రి మాతృ వందన యోజన, జననీ సురక్ష యోజన పథకాలను ఆరోగ్య శాఖ ఈ ఏడాది మే నెల వరకు నిర్వహించింది. అప్పటి వరకు లబ్ధిదారులకు ప్రోత్సాహక నగదు మంజూరైంది. ఐసీడీఎస్ మాత్రం నేటి నుంచి ప్రారంభించింది. దీంతో జూన్, జూలై మాసాల్లో గర్భిణుల నమోదు, నగదు మంజూరు పై స్పష్టత లేదు. ఈ రెండు మాసాలు లబ్ధిదారుల నమోదు ఎవరు చేయాలి?, నిధులు పరిస్థితి ఏమిటి? అన్న దానిపై సమాచారం లేదు. ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని పల్నాడు జిల్లా ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి పేర్కొన్నారు.

జాతీయ రహదారి ప్రాజెక్టుల..

శంకుస్థాపన ఏర్పాట్ల పరిశీలన

- మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు



ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎన్‌హెచ్ఏ పీడీ పార్వతీశం

మంగళగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీలు పాల్గొననున్న జాతీయ రహదారి ప్రాజెక్టుల శంకుస్థాపన, జాతికి అంకితం తదితర కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లను, జాతీయ హైవే అథారిటీస్ పీడీ పార్వతీశం, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలు పరిసరాల్లో వాహనాల పార్కింగ్, సభా వేదిక, సీటింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, ఇతర అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గుంటూరు ఆర్డీఓ కె. శ్రీనివాసరావు, డీఎస్పీలు మురళీకృష్ణ, ఎం. రాము, డీటీసీ సీతారామిరెడ్డి, ఫైర్‌అధికారి వై. వెంకటేశ్వర్లు, ఏపీ సీపీడీసీఎల్ ఏఈ మల్లికార్జున, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎస్. రవీంద్రరెడ్డి, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీకాంత్, మంగళగిరి, గుంటూరు పశ్చిమ తహసీల్దార్లు కె.దినేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా తృతీయ సోపాన్ పరీక్ష శిబిరం



జాతీయ జెండాతో విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

నాదెండ్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయంలో తృతీయ సోపాన్ పరీక్ష శిబిరం - 2025(సౌత్) శుక్ర వారం కోలాహలంగా ప్రారంభమైంది. హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలోని కేంద్రీయ విద్యాలయ భారత్ స్కౌట్స్ గైడ్స్ ఆధ్వర్యంలోని ఈ శిబిరానికి తెలంగాణ నుంచి 174 మంది విద్యార్థులు, 26 మంది ఎస్కార్ట్ టీమ్‌లు హాజరయ్యాయి. ఈ సందర్భంగా స్కౌట్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు విద్యాలయ ప్రాంగణంలో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. జాతీయ, స్కౌంట్స్ జెండాలతో విన్యాసాలతో గాడ్ ఆఫ్ ఆనర్ అందజేశారు. విద్యాలయం ప్రిన్సిపల్ నీరజ్ కుమార్ శ్రీ వాస్తవ మాట్లాడుతూ ఈ శిబిరం స్కౌట్స్, గైడ్స్ విద్యార్థుల్లో దేశభక్తి, ఐక్యత పెంపొందించేందుకు దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్వార్టర్ మాస్టర్, క్యాంపు అధికారి ఎస్.విజయ కుమార్, ఎల్‌వోసీ రమేష్ బాబు శిబిరం లక్ష్యాల గురించి వివరించారు.

లచ్చన్నగుడిపూడిలో కిడ్నీ రోగుల వివరాల సేకరణ



కిడ్నీరోగుల వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

తాడికొండ,ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చన్నగుడిపూడి గ్రామంలో కిడ్నీ రోగుల వివరాలను సేకరించడానికి ప్రత్యేక వైద్య బృందం శుక్రవారం పర్యటించింది. గ్రామంలో సుమారు 20 మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఇంత మందికి కిడ్నీ వ్యాధి రావడానికి గల కారణాలు తెలుసుకోవాడానికి ప్రత్యేక వైద్య బృందాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి లచ్చన్నగుడిపూడికి పంపించారు. డీఎంహెచ్‌వో ఇప్పటికే గ్రామంలో పర్యటించారు. తాగునీటి వల్ల ఏమైన కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారా.. అనే అనుమానంతో గ్రామంలో ఉన్న ఆర్‌వో ప్లాంట్ నీటిని, పంచాయతీ కొళాయి నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అంతేకాకుండా ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ద్వారా వివరాలను సేకరిస్తున్నారు. బాధితుల ఆహారపు అలవాట్లు, ఇతర వ్యాధులకు ఏమైన మందులు వాడుతున్నారా అనే దానిపై వివరాలు సేకరించారు. సేకరించిన వివరాల నివేదికను ప్రభుత్వానికి పంపనున్నారు. నీటి నమూనాల రిపోర్టుల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటారని డాక్టర్లు పేర్కొన్నారు.

నడిరోడ్డుపై వైసీపీ కార్యకర్తల హంగామా

- యువజన నేత పుట్టిన రోజు వేడుకలతో ప్రజలకు అసౌకర్యం
- ఏడుగురి అరెస్టు... పరారీలో మరికొందరు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీకి చెందిన యువజన విభాగం నాయకుడి పుట్టిన రోజు వేడుకల పేరిట బుధవారం అర్ధరాత్రి నడి రోడ్డుపై ఆ పార్టీ కార్యకర్తలు హంగామా చేశారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో ఏడుగురు వైసీపీ కార్యకర్తలను అరెస్టు చేయగా.. మరికొందరు పరారీలో ఉన్నట్లు గుంటూరు ఈస్టు డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు సీఐ వెంకటప్రసాద్ శుక్రవారం వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. నగరానికి చెందిన వైసీపీ యుజన విభాగం అధ్యక్షుడు సీహెచ్ వినోద్ గత నెల 30న నగరంలోని మణిపురం బ్రిడ్జి వద్ద నడి రోడ్డుపై పుట్టిన రోజు వేడుకలు జరిపారు. ఈ వేడుకల్లో నెహ్రూనగర్, ఇజ్రాయెల్ పేటకు చెందిన వైసీపీ కార్యకర్తలు పాల్గొని అర్ధరాత్రి కేక్ కటింగ్ చేశారు. భారీ బాణ సంచా కాలుస్తూ.. మందుగుండు సామగ్రి పేల్చారు. దీంతో స్థానికులకు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పాత గుంటూరు పోలీసులు వైసీపీకి చెందిన ఏడుగురు కార్యకర్తలను అరెస్టు చేశారు. మరికొందరు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నడి రోడ్డుపై బర్త్‌డే పార్టీలు చేసుకోవడం నిషేధమని, ప్రజలకు అసౌకర్యం కలిగించినా, ఇక ఎలాంటి చర్యలకు పాల్పడినా.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బైక్‌ను ఢీకొన్న లారీ..విద్యార్థికి తీవ్ర గాయాలు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట బైపాస్ రోడ్డులో కోటప్పకొండ రోడ్డు జంక్షన్ వద్ద మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొన్న సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. కోటప్పకొండ రోడ్డులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి చరణ్‌సాయి శుక్రవారం సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వినుకొండ వైపు నుంచి గుంటూరు వెళుతున్న లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో విద్యార్థి చరణ్ సాయికి తీవ్రంగా గాయాలయ్యాయి. విద్యార్థి చరణ్ సాయిని తోటి విద్యార్థులు వైద్యశాలకు తరలించారు. విద్యార్థి స్వగ్రామం చిలకలూరిపేట మండలం యాటీ అని విద్యార్థులు తెలిపారు.

రిటైర్డ్ టీపీవో పింఛన్‌లో 10 శాతం కోత

నరసరావుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ప్రణాళికా విభాగం అధికారిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఎం.హరిజానాయక్‌పై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నాయక్‌కు ఐదేళ్ల పాటు తాను పొందుతున్న పింఛన్‌లో ప్రతి నెలా 10శాతం కోత విధిస్తూ దీనినే జరిమానాగా పరిగణిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. మునిసిపల్ స్థలం అక్రమణ జరిగిన సందర్భంలో కోర్టులో దావా ఉండగా సకాలంలో కోర్టుకు సంబంధిత రికార్డులను సమర్పించకపోడంపై విచారణ జరిపారు. కోర్టుకు రికార్డులను అందజేయడంలో నిర్లక్ష్యంగా నాయక్ వ్యవహరించినట్లు విచారణలో నిర్ధారణ కావడంతో అయనకు పింఛన్‌లో కోత విధిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

నేడు 'అన్నదాత సుఖీభవ'

● పాల్గొననున్న మంత్రి గొట్టిపాటి, జీవీ

వినుకొండ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని శనివారం నేడు కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. దీనిలో భాగంగా పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఈ పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు హాజరై ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకంలో 7000 నేరుగా రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేయడం జరుగుతుందన్నారు. మార్కెట్ యార్డులో జరిగే కార్యక్రమంలో నియోజకవర్గంలోని రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

క్లుప్తంగా...

● వినుకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులోని నవాజ్‌కుంట పాఠశాలకు జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు కమలారామ్ దంపతులు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల హెచ్ఎం బాలాజీనాయక్ కమలారామ్ దంపతులను అభినందించారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద తొలగించిన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని వైసీపీ నాయకులు వినుకొండ మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

● వినుకొండ: ఈ నెల 7, 8 తేదీల్లో సీపీఐ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా ద్వితీయ మహాసభలు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ తెలిపారు. జిల్లా మహాసభలకు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలన్నారు.

● చిలకలూరిపేట: తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నరసరావుపేటలోని గాంధీపార్క్ వద్ద శనివారం ధర్నా కార్యక్రమం జరుగుతుందని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు, ఎస్టీయూ డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలోని ఉపాధ్యాయులు, ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

● నరసరావుపేట టౌన్: కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, నరసరావుపేట ఎస్ఎం డెంటల్ కేర్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం శుక్రవార నిర్వహించారు. డాక్టర్ ఎస్ఏ రహమాన్ షరీఫ్, డాక్టర్ షమీరా వైద్య సేవలు అందజేశారు. 862మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

● నరసరావుపేట టౌన్: ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో పెట్లూరివారిపాలెంలో ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ అవగాహన దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ భూషణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: మండలంలోని పసుమర్రులో మద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం నిర్వహించారు. ట్రైనీ ఎస్ఐ శ్రీకాంత్, హెచ్ఎం హనుమంతరావు, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు గద్దె హరిబాబు, యార్లగడ్డ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: జడ్పీ పాఠశాలలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, హెచ్ఎం సుభానీ పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలకు చెందిన 46 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లను శుక్రవారం ప్రదానం చేశారు. ఎన్‌సీసీ అధికారి మహమ్మద్ రసూల్, 25 ఆంధ్రా బెటాలియన్ హవల్దార్ మేజర్ రామ్‌సింగ్, ఈశ్వరరెడ్డిలు సర్టిఫికెట్లను అందజేశారు.

బందిపోటు కంటే ప్రమాదకారి జగన్‌రెడ్డి

వినుకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం అవినీతి కేసులో అడ్డంగా దొరికిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బందిపోట్ల కంటే ప్రమాదకరమైన నరహంతకుడని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. స్థానిక 15వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి ప్రచార కార్యక్రమం, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి అవ్వాతాతలను పలకరించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.3,700కోట్లు అక్రమార్జన కోసం జే బ్రాండ్‌లు తాగించి 32వేల మంది ప్రాణాలు బలిగొన్నాడని, 35లక్షల మందిని అనుపత్రిపాలు చేశాడని అలాంటి వ్యక్తి నరహంతకుడు కాక ఏమవుతాడని ప్రశ్నించారు. అబద్ధాలు, అసత్య ప్రచారాలు, తప్పుడు కేసులు, దుర్మార్గాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. నెల్లూరు జైలు దగ్గరకు వెళ్లి మొసలి కన్నీరు కారుస్తున్న జగన్, సోదరి లాంటి ప్రశాంతిరెడ్డిపై నీచమైన వ్యాఖ్యలు చేస్తే కనీసం ఖండించకపోవడం దుర్మార్గం కాక ఏమిటని నిలదీశారు. అంతేకాక మిథున్‌రెడ్డిది అక్రమ అరెస్టు అని జగన్ అనడం విచిత్రంగా ఉందన్నారు. జగన్ అవినీతి ఆకలి కారణంగా మిథున్‌రెడ్డి జైలుకు వెళ్లారన్నది బహిరంగ రహస్యమన్నారు. వైసీపీలో జగన్ అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ధూళిపాళ్ల నరేంద్ర, బీసీ జనార్ధన్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టి వేధించారని, కూటమి ప్రభుత్వంలో ఆధారాలు ఉన్నవారిపైనే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జగన్ నిర్వాహకం వల్ల ఎంతో మంది ఐఏఎస్‌లు జైలుకు వెళ్లారో మరచిపోతే ఎలా అన్నారు. గతంలో శ్రీలక్ష్మి నుంచి ప్రస్తుతం ధనుంజయ్‌రెడ్డి వరకు జగన్ వల్లనే జైలుకు వెళ్లారని, ఇవన్నీ తెలుసుకోవాలన్నారు.



పింఛన్లను పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వితంతు మహిళలకు కొత్త పింఛన్ల అండ...

రాష్ట్రంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా పింఛన్లు ఇస్తున్న ప్రభుత్వం ఎన్‌డీఏ ప్రభుత్వమని, 1వ తేదీన పండుగ రోజులా చేస్తున్నామన్నారు. ఏళ్లుగా పింఛన్లు రాని వితంతువులకు కొత్త పింఛన్లు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు వారంతా జేజేలు పలుకుతున్నారన్నారు. కొత్త రేషన్‌కార్డులు కావాల్సిన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వారిలో అర్హత ఉన్న

పింఛన్ల పంపిణీ, సుపరిపాలన కార్యక్రమంలో చీఫ్‌విప్ జీవీ

వారు తరువాత పించన్‌కు కూడా అప్లికేషన్ పెట్టుకోవచ్చన్నారు.

గాంధీ కాంస్య విగ్రహానికి లక్ష విరాళం...

కారులో వెళ్లడానికి అడ్డు వస్తున్నాయని పేదల ఇళ్లు కూల్చేసిన చరిత్ర కలిగిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఇప్పుడు విగ్రహాల పేరిట రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. పట్టణ అవసరాలకు అనుగుణంగా అందరితో మాట్లాడి మున్సిపల్ అధికారులు గాంధీ విగ్రహం తొలగిస్తే రాద్ధాంతం చేయాలని చూస్తున్నారని, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొత్తగా కాంస్య విగ్రహం ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అందుకు తాను కూడా రూ.లక్ష విరాళం ఇస్తానని వెల్లడించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

వినుకొండ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలుతీసుకుంటానని హామీ ఇచ్చారు.

అర్హులైన పేదలందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

● ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) సంక్షేమం, అభివృద్ధి ఎజెండాగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నియోజకవర్గంలోని గోనేపూడి, చింతలపాలెం, యల్లమంద గ్రామాలలో, నరసరావుపేట పట్టణంలోని 3వ వార్డులో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అర్హత గల ప్రతి వ్యక్తికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో స్పౌజ్ పింఛన్లను ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు శుక్రవారం పంపిణీ చేశారు. 175 పింఛన్లు నూతనంగా వచ్చినట్లు ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు తెలిపారు. ఎంపీడీవో కే మాథ్యూబాబు, ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల సచివాలయాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అమరావతిలోని సచివాలయంలో గురువారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. నరసరావుపేట నియోజకవర్గానికి సంబంధించి పలు ముఖ్య అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ, కార్యకర్తల శ్రేయస్సు కోసం అవసరమైన చర్యలపై ముఖ్యమంత్రి ఎమ్మెల్యేకు సూచనలు చేశారు. నరసరావుపేట మునిసిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో కాపు భవన నిర్మాణానికి అనుకూలమైన డీపీఆర్, నిధుల అవసరాలపై చర్చించారు. జేఎన్‌టీయూ కళాశాలకు సంబంధించి ప్రత్యేకించి వివరాలు తెలియజేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, మాజీ మున్సిపల్ చైర్మన్ సుబ్బరాయగుప్తా తదితరులు

16వ వార్డులో తొలిఅడుగు...

నరసరావుపేట టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించడంతో పాటు దానిని పేదలకు పంచడం తెలిసిన పార్టీ తెలుగుదేశం అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం రాత్రి నరసరావుపేట పట్టణంలోని 16వ వార్డులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సామర్థ్యం, చిత్తశుద్ధి కలిగిన నాయకుడని అన్నారు. సింగపూర్‌లో పర్యటనలో రూ.45వేల కోట్లు పెట్టుబడులకు అంగీకారం కుదిరిందన్నారు. ఈ పర్యటనలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కీలకపాత్ర పోషించారన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి సుపరిపాలన గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో పింఛన్లకు ప్రతి నెల రూ.10కోట్లు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి నెల రూ.10కోట్ల మొత్తాన్ని సామాజిక పింఛన్లుగా పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం వెల్లడించారు. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, గోవిందపురంలో, చిలకలూరిపేట పట్టణంలోని 6, 13వార్డులలో ఆయన పర్యటించి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. 6వ వార్డులో విలేకరులతో మాట్లాడుతూ ఆయన వివిధ కేటగిరీల్లో ఉన్న 64 లక్షల మందికి కేవలం సామాజిక పింఛన్ల కింద కూటమిప్రభుత్వం ఏటా రూ.34వేల కోట్లు అందిస్తోందన్నారు. జగన్ హయాంలో ఎలాంటి సాయం చేయలేదని, అప్పటినుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో అర్హులైన 1,09,000 మందికి వితంతువులకు కూటమి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ చైర్మన్ కరీముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటి, పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు సమద్ ఖాన్, ఎం.రవి, రూరల్ మండల అధ్యక్షుడు జె.మదన్‌మోహన్, గౌడ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కె.రమణ, కమిషనర్ శ్రీహరిబాబు పాల్గొన్నారు.



సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

● రొంపిచర్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రొంపిచర్లలోని వాసవి, శంకరస్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వరస్వామి, విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి, గోగులపాడులోని చంద్రమౌళీశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి, సంతగుడిపాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు మిగిలిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో ఈ నెల 1వ తేదీ నుంచి జరిగే సర్వేకు సహకరించాలని ఎంపీడీవో కే.మాథ్యూబాబు శుక్రవారం తెలిపారు. స్వమిత్వలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలకు సంబంధించిన, భవనాలకు సంబంధించిన సర్వేలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 13 గ్రామాల్లో ఈ సర్వే జరుగుతుందన్నారు.

● ఈపూరు: మండలంలోని బొగ్గరం హైస్కూల్ పూర్వవిద్యార్థి మన్నం అజయ్ ఆటస్థలం అభివృద్ధికి రూ.15వేలు సాయం చేశారు. ఈ మేరకు శుక్రవారం హెచ్ఎం రామారావుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ మద్దం వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వినుకొండ: పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.10వేలు విలువ చేసే బీరువాను కస్నెబోయిన శ్రీను (ఉపాధ్యాయుడు) శుక్రవారం వితరణ చేశారు. కార్యక్రమంలో పీడీ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు రాంబాబు, గాయత్రి, రామకృష్ణమ్మ, యూటీఎఫ్ చంద్రజిత్ యాదవ్, పద్మజ, కృష్ణమూర్తి, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: జగన్ తన పర్యటనలలో రెచ్చగొట్టే వ్యాఖ్యలతో రాష్ట్రంలో అశాంతి రాజేస్తున్నారని, ఇటువంటి చర్యలతో సమాజానికి ఆయన ఏం సందేశం ఇస్తున్నారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కోశన్వీనర్ పెంటేల బాలాజి శుక్రవారం ప్రశ్నించారు. బహిరంగంగా జగన్ చేస్తున్న ఈ హత్యా రాజకీయ ప్రకటనలు రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చే కుట్రలో భాగమని ఆరోపించారు.

విరిగిన చప్టా.. తప్పిన ప్రమాదం

ఈపూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్ళపల్లి మేజర్ కాలువపై అగ్నిగుండాల సమీపంలో ఏర్పాటు చేసిన చప్టా శుక్రవారం విరిగింది. శ్రీనగర్ నుంచి అగ్నిగుండాల వెళ్తున్న బోర్‌వెల్ లారీ చప్టా మీదుగా వెళ్తున్న సమయంలో విరిగిపడింది. ఆసమయంలో లారీ, చివర టైర్లు కట్టకు ఆనుకొని ఉండడంతో లారీ ముందుకు వెళ్ళలేక నిలిచిపోయింది. ఎక్స్‌కవేటర్‌ను తీసుకువచ్చి లారీని అక్కడ నుంచి బయటకు తీశారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరి శాంతారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



విరిగిన చప్టా

రాష్ట్రస్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీలకు సంసిద్ విద్యార్థులు

కనమర్లపూడి (శావల్యాపురం) ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమర్లపూడి సమీపంలోని సంసిద్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అత్యున్నత ప్రతిభను కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్‌బాబు శుక్రవారం తెలిపారు. తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలోని గీతాంజలి సీబీఎస్సీ స్కూల్‌లో గురువారం జరిగిన జిల్లాస్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో అండర్-10విభాగంలో పాఠశాల విద్యార్థి షారుక్ రజత, కాంస్య పతకాలను సాధించినట్లు తెలిపారు. అండర్-12విభాగంలో పాఠశాల విద్యార్థులు యశ్వంత్, భవానీప్రసాద్ రజత పతకాలను సాధించినట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో పాఠశాల విద్యార్థులు లక్ష్మీ శృంగేరీ కాంస్య పతకాన్ని, హంస వర్షిత రజత పతకాన్ని సయ్యద్ హర్షిత్ బంగారు, రజత పతకాలను సాధించినట్లు తెలిపారు.

పంట కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు

శావల్యాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నూతన రైల్వేట్రాక్ వలన తలుపులవాగు కాలువ పూర్తిగా పూడిపోయి పొలాలకు సాగునీరు నిలిచిపోయిందని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో శావల్యాపురం సాగునీటి సంఘం అధ్యక్షులు మార్నేని కొండలరావు, మరికొందరు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు నర్సరావుపేట మైనర్ ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాసరావు శుక్రవారం కాలువ పూడిపోయిన ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

తల్లి పాల వారోత్సవాలు

నూజెండ్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళవారిపాలెంలో శనివారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను తెలియ జేస్తూ పోషకాహారం తీసుకోవాలని, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్లు తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

స్పౌజ్ పింఛన్ల పంపిణీ

నాదెండ్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పించన్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. 199 మందికి పించన్‌లను పంపిణీ చేశారు. నాదెండ్లలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి, సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు హరిబాబు, కార్యదర్శి సుబ్బారావు, నాయకులు కోటేశ్వరరావు, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు. అమీన్‌సాహెబ్‌పాలెంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగపూర్ణచంద్రరరావు పాల్గొన్నారు. నాయకులు, అధికారులు పించన్‌లను పంపిణీ చేశారు.

● యడ్లపాడు: మండలంలోని ఉన్నవ గ్రామంలో 10 స్పౌజ్ పింఛన్లు జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కుర్రా రత్తయ్య శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకుమాను శ్రీనివాసరావు, సాయిబాబు, గల్లా లక్ష్మీనారాయణ, బొల్లినేని శ్రీనివాసరావు, జనసేన గ్రామ అధ్యక్షుడు కె సాంబశివరావు, శ్రీహరి, సామినేని రంగారావు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు. కాగా వంకాయలపాడులో మండల టీడీపీ అధ్యక్షుడు సాయిబాబు, టీడీపీ నాయకులు, యడ్లపాడులో ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ స్పౌజ్ పింఛన్లు పంపిణీచేశారు.

● శావల్యాపురం: ప్రభుత్వం స్పౌజ్ పించన్‌లను అందజేసి వారి కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో చేయూతనందిస్తోందని జడ్పీటీసీ పారా హైమావతి అన్నారు. మండలంలోని వేల్పూరులో ప్రభుత్వం కొత్తగా మంజూరుచేసిన 101స్పౌజ్ పింఛన్లను ఎంపీడీవో పి.సీతారామయ్యతో కలిసి జడ్పీటీసీ పి.హైమావతి శుక్రవారం పంపిణీ చేశారు.

● ఈపూరు: టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు మండలంలో నూతనంగా మంజూరైన పించన్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈపూరు సొసైటీ అధ్యక్షుడు వి.హనుమయ్య, క్లస్టర్ ఇన్‌చార్జిలు దండే కోటేశ్వరరావు, జాస్తి బుచ్చారావు, కో-కన్వీనర్ ఎస్.కోటేశ్వరరావు, వి.పాపారావు, సెక్రటరీ రత్నం పాల్గొన్నారు.

మసీదు మాన్యంలో విద్యుత్ సమస్యలు

వినుకొండ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మసీదుమాన్యంలో విద్యుత్ సమస్యల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి నీటి పంపిణీ ఆపివేయడంతో మూడేళ్లుగా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రధాన రహదారిలో ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాల నుంచి కనెక్షన్లు తీసుకుని కాలం గడపాల్సి వస్తోంది. ఒక్కో స్తంభానికి వందలకొద్దీ సర్వీసు వైర్లు ఉండటం కారణంగా ఏ ఒక్క ఇంట్లో విద్యుత్ సమస్య ఏర్పడినా తమ సర్వీసు ఎక్కడ ఉందో వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలోని పాలకులు ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్ల వద్ద వీధిలైట్లు ఏర్పాటుచేసి మీటర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వీధిలైట్ల వద్ద వందల కొద్ది ఉన్న సర్వీస్ వైర్లు

జడ్జీల బదిలీ కోరుతూ న్యాయవాదుల ఆందోళన

నరసరావుపేట లీగల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట 13వ అదనపు జిల్లా న్యాయాధికారి, అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారుల బదిలీని కోరుతూ శుక్రవారం స్థానిక న్యాయవాద సంఘం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. వీరిద్దరు బదిలీ అయ్యేంతవరకు ఈ నెల నాలుగో తేదీ నుంచి కోర్టులకు ఏ న్యాయవాది హాజరు కాకూడదని న్యాయవాద సంఘం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయాధికారుల ప్రవర్తనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయవాదుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వారి ప్రవర్తన ఉందన్నారు. న్యాయవాద సంఘ తీర్మానాన్ని కాదని ఎవరైనా విధులకు హాజరైతే వారిపై బార్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. ఈ మేరకు న్యాయవాద సంఘ అధ్యక్షుడు గన్నే వెంకట సుబ్బారావు అధ్యక్షతన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు.

7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 1 (ఆంధ్ర జ్యోతి): పల్నాడు జిల్లాలోని అన్ని గ్రామాలలో క్షేత్రస్థాయిలో ఈ నెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు డాక్టర్ బి.రవి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రసూతి విభాగంలోని బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ గీతాంజలి డాక్టర్ ప్రసన్న, డాక్టర్ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.



తల్లిపాల ప్రాముఖ్యపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రవి

రెండు లారీలు ఢీ... ఇద్దరు డ్రైవర్లకు గాయాలు

వినుకొండ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లకు గాయాలైన సంఘటన మండలంలోని చీకటీగలపాలెం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. కర్నూలు నుంచి ఏలూరు చేపల మేతతో వెళ్తున్న లారీ, విజయవాడ నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ట్రిపుల్ ఎక్స్ సోప్‌ల లారీ ఎదురెదురుగా ఢీకొనగా వినుకొండ నుంచి మార్కాపురం వైపు వెళ్తున్న మరొక లారీ బలంగా ఢీకొట్టడంతో రెండు లారీల ముందు భాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో లారీ డ్రైవర్లు వెంకట సుబ్బయ్య, నాగరాజు గౌడ్‌లకు గాయాలు కావడంతో 108లో వినుకొండకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో ధర్నా

యడ్లపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సంపత్‌బాబు తెలిపారు. శుక్రవారం యడ్లపాడు మండలం లింగారావుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫ్యాప్టో సభ్యులు సన్నాహకసమావేశం నిర్వహించారు. 18 కీలక డిమాండ్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించి డిమాండ్లు నెరవేర్చాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్యుడు కేవీ రామిరెడ్డి, బి.సుధాకరరావు, పి.విజయశ్యామ్యూల్, ఎస్.వరప్రసాదరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

డీఎస్పీకి ఘన సన్మానం

నర్సరావుపేట లీగల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావుగా ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి డీఎస్పీ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఏఎస్పీ సంతోష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్తిరాజు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, ఇతర పోలీసు అధికారులు పల్నాడు జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాణిక్యాలరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విశ్రాంత డీఎస్పీ నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు